# పతనం?

వసుంధర

నాకు అయిదో ఏడు నడుస్తూండగా కాబోలు - అమ్మ పోయింది. ఆ తర్వాత ఆర్నెల్లు తిరక్కుండా నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు.

నా చెల్లెలు నాకంటె రెండేళ్ళు మాత్రమే చిన్నది. మమ్మల్నిద్దర్నీ కంటికి రెప్పలా చూసుకునేది అమ్మ. ఈ ప్రపంచంలో ఆనందంతప్ప మరేదీ లేదని నేననుకునే సమయంలో నాన్న మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడు. కొత్తమ్మ పేరు వాణి. ఒక సంవత్సరంపాటు కొత్తమ్మ మమ్మల్ని చాలా బాగా చూసింది. ఆ తర్వాత కొత్తమ్మ ఉత్త మనిషి కాదని ఒకరోజున పొరుగింటావిడ అంది.

ఉత్తమనిషి కాకుండా పోయినప్పట్నించీ కొత్తమ్మకు

కొత్త అందాలు వచ్చాయి. నాన్న కూడా కొత్తమ్మను మాకంటె గారంగా చూడ్డం మొదలు పెట్టాడు. కొన్ని నెలలు పోయాక కొత్తమ్మ మాకో కొత్త చెల్లెల్నిచ్చింది. తెల్లగా, అందంగా, బొమ్మలావున్న కొత్త చెల్లెలు నాకూ, చెల్లాయికీ కూడా నచ్చింది.

కొత్త చెల్లెలు వచ్చాక కూడా కొత్తమ్మ కొ...ళ్ళి మమ్మల్నిద్దర్నీ బాగానే చూసింది. కొత్త చెల్లాయి ఎదుగుతున్నకొద్దీ కొత్తమ్మ నన్ను కోప్పడ్డం మొదల యింది. చిన్నపిల్లనయినా పట్టించుకోకుండా నా చెల్లా యికి చాలా పనులు చెప్పి చేయించేది. అప్పుడప్పుడు నాన్న కలగజేసుకుని దెబ్బలాడేవాడు. అయితే కొత్తమ్మ నోరు చాలా పెద్దది. వాళ్ళిద్దరూ ఎప్పుడు దెబ్బలాడుకున్నా కొత్తమ్మే గెలిచేది. నాన్న ఓడి పోయేవాడు.

"రెండో పెళ్ళామంటేనే అంత—ఏమగాడూ కూడా దాని ముందు నోరెత్తలేడు—" అంటూండేది నా దగ్గర వెంకాయమ్మగారు. ఆవిడ మా పొరుగింట్లో వుంటుంది. మంచిది కాదని చుట్టుపక్కల అనుకుంటూంటారు.

కొత్తమ్మ నాన్నకి రెండో పెళ్ళాంట. మా అస లమ్మేమో మొదటి పెళ్ళాంట. మగాళ్ళకి మొదటి పెళ్ళాంకంటె రెండో పెళ్ళాం అంటేనే ఎక్కువిష్టంగా వుంటుందిట. అమ్మ చచ్చిపోయేక నాన్న ఇంకో పెళ్ళి చేసుకుంటే—ఆ కొత్తమ్మ మాకు సవతి తల్లి అవుతుందిట. సవతి తల్లులు మంచివాళ్ళు కారుట. వెంకాయమ్మగా రివన్నీ నాకు చెప్పి—"వాణి ఎలా చూస్తుందిరా నిన్ను?" అనడిగేది. నేనిచ్చే జవాబులావిడకు సంతృ

ప్తిగా ఉండేదికాదు. "వెర్రిమొకమా-పెద్దయితేగానీ అర్థంకాదు నీకు—..." అనేసి అమ్మదగ్గరకు వెళ్ళి పోయేది.

అమ్మ, ఆవిడ చాలా బాగా మాట్లాడుకునేవారు. కొత్తమ్మ ఆవిణ్ణి బాగా ఆదరించేది. ఆవిడ వచ్చి వెళ్ళాక అమ్మ ఎందుకో నామీద కోప్పడేది. అప్పుడప్పుడు అమ్మ నా గురించి నాన్నకేమైనా ఫిర్యాదు చేస్తే —"ఎందుకే ఆ వెంకాయమ్మగారి మాటలు విని ఆ పసి వాళ్ళ ననుమానిస్తావ్?" అనేవాడు నాన్న.

"వాడా-వాడు పసివాడా-చూడండి ఆ వెధవ చూపులు?" అనేది అమ్మ.

ఈ మాటలు వినబడగానే వెధవ చూపులంటే ఎలా గుంటాయో తెలుసుకోడానికి పరుగెత్తుకుని అద్దంలో ముఖం చూసుకునేవాణ్ని. ఏమీ తెలిసేదికాదు.

నాలో ఆవేశం పాలున్నమాట నిజమేకానీ - అది తగ్గేక నా కెవరిమీదా కోపముండేది కాదు. కొత్తమ్మంటే నా కిష్టమే. ఎందుకంటే ఈ అమ్మ చాలా అందంగా ఉంటుంది. అందంగా నవ్వుతుంది కూడా.

నాకు పదేళ్ళు వచ్చేసరికి కొత్తమ్మకింకో అబ్బాయి పుట్టాడు. ఇప్పుడు కొత్తమ్మ పాతబడిపోయింది. అందువల్ల అమ్మనే అంటున్నాను నేను. పాతమ్మ జ్ఞాపకాల లోంచి తప్పుకుంటోంది.

నాకు అమ్మ, నాన్నలకంటె చెల్లెళ్ళూ, తమ్ముడూ అంటేనే ఎక్కువిష్టం. నా అసలు చెల్లెలు ఉమ, సవతి చెల్లెలు రాధ, సవతి తమ్ముడు శంకరం. రాధకీ శంకరానికీ నేనూ ఉమా చాలా చాకిరీ చేయవలసి వచ్చేది.

వాళ్ళు మంచివాళ్ళే కానీ అమ్మ గారాబంవల్ల వాళ్ళకి పెంకితనం బాగా అబ్బింది. ప్రతిదానికీ అందర్నీ తిట్టడం వాళ్ళకి అలవాటయింది.

వెంకాయమ్మగారు నాకు చెప్పనే చెప్పింది.—“అసలే ఉమ నోరులేని పిల్ల-మీ అమ్మ దాన్ని [illegible] బాధలూ పెడుతుంది. మీనాన్న ఉన్నా లేనట్లే. అలా బెల్లంకొట్టిన రాయిలా చూస్తూ ఊరుకుంటాడు—నువ్వే దాన్నోకంట కనిపెట్టుకునుండాలి నాయనా—”

ఈ మాటలు నా హృదయంలో బాగా నాటుకున్నాయి. నేను చూస్తూండగా ఉమమీద ఈగనుకూడా వాలనిచ్చేవాణ్ణికాదు. దానికే పని చెప్పినా నేను చేసేవాణ్ణి. ఉమ జోలికి వెడితే రాధ, శంకరాలనుకూడా క్షమించేవాడిని కాదు.

ఉమకు ఎదిరించడం చేతకాకపోవడంవల్ల అంతా దాన్ని నోరులేని పిల్ల అంటారు. నోరైతే లేకపోవచ్చు కానీ అది చాలా తెలివైనది. దానికీ నాకూ వయస్సులో తేడా రెండేళ్ళున్నా-చదివే క్లాసుమాత్రం ఒక్కటే తేడా. చామనచాయ రంగులో చూడ ముచ్చటగా వుంటుందది. పన్నెండేళ్ళు వచ్చేసరికీ అది ఇంటి పనుల్లోనూ వంటపనుల్లోనూకూడా ఆరితేరింది.

ఎన్ని పనులైనా నోరెత్తకుండా చేసేదాన్ని చూస్తే అమ్మకూడా ముచ్చటపడుతూండేది—“దాన్ని చూసైనా నేర్చుకోకూడదురా—ప్రతిదానికీ విరుచుకుని మీదపడ్డం తప్ప నీకేం వచ్చు—” అంటూండేది నాతో.

“దాన్ని చూసి నేనేకాదు. నువ్వూ నేర్చుకోవాలి-” అనేవాణ్ణి.

అమ్మ కోపంగా—"మాటకుమాట చెప్పడంమాత్రం వచ్చు—" అనేది.

ఉమది చాలా మంచి స్వభావం. రాధ, శంకరం దాన్ని బాగా ఏడిపించేవారు. అయినా అది ఉడుక్కునే కాదు. ఎవరికీ ఫిర్యాదు చేసేదికాదు. నేను తరచి అడిగినా ఏం జరగలేదని అబద్ధమాడేది తప్పితే నిజం చెప్పేదికాదు.

రాధది ఇందుకు పూర్తిగా విరుద్ధం. ప్రతిదానికీ అబద్ధం చెప్పేసేది. ఎదుటివాళ్ళకు శిక్షణ పడడంకోసం అప్పుడప్పుడది నిజాన్ని అబద్ధంగా మారుస్తూండేది.

ఒకసారి నేను, ఉమ, రాధ ఓ జానపద చిత్రంచూచి తిరిగివస్తున్నాం. రాధ రోడ్డుమీద తిన్నగా నడవదు. అసలే అది ఇరుకైన రోడ్డు. తరచుగా కార్లు తిరుగుతూంటాయి. నేను ఉమ విషయంలో బెంగపడడం లేదుగానీ రాధను మాత్రం వేయికళ్ళతో కనిపెట్టుకుని చూస్తున్నాను.

రాధ ఎగురుతుంది—ఇటు వెడుతుంది—అటు వెడుతుంది. చేయిపట్టుకు ఆపితే విదిలించి పారేస్తుంది. చెప్పిన మాట వినదు. చూస్తూండగా ఒక కారు దానిమీదకు రాబోయింది. నేను దాన్ని స్పీడుగా పక్కకి తోసేశాను. వెంట్రుకవాసిలో ప్రమాదం తప్పిపోయింది.

విషయం చూసిన చాలామంది రాధను తిట్టారు. నన్ను మెచ్చుకున్నారు.

రాధ రోడ్డుకి పక్కగా పడిపోయింది. చేతులు గీరుకున్నాయి. పరికిణీకి బాగా దుమ్మయింది. అప్పటి కప్పుడది ఏమీ అనలేదు కానీ ముఖం చూస్తే బాగా

ఉక్రోషం వచ్చిందని తెలుస్తోంది. ఇంటికెళ్ళి — వెళ్ళగానే—"అన్నయ్య నన్ను తోసేశాడమ్మా—" అంటూ చేతికైన గాయాన్నీ, మాసిపోయిన పరికిణీనీ చూపించింది అమ్మకి.

"ఏమే నిజమేనా?" అనడిగింది అమ్మ ఉమను.

ఉమ మాట్లాడలేదు. రాధకి వ్యతిరేకంగా నిజం చెప్పాల్సొస్తే ఉమ మాట్లాడదు. ఆ సంగతి నాకు తెలుసు—"దాన్నెందుకూ అడగడం. నన్నడిగితే నేను చెప్తాను—" అంటూ జరిగింది చెప్పాను.

"అంతా అబద్ధం. అన్నయ్య కావాలనే నన్ను తోసేసాడు—" అంది రాధ.

అమ్మ నన్ను నానామాటలూ అంది. నేను లెక్క చేయలేదు—"అనవసరంగా నన్ను తిడుతున్నావ్—ఈ సారి ట్రక్కు దానిమీంచి వెడుతున్నా చూస్తూ ఊరుకుంటాను. ఏ కార్లూ నడవని రోడ్డులోకూడా నాపక్కన అదుంటే కళ్ళు కాలవలోకి తోసేస్తాను—" అన్నాను కోపంగా.

అమ్మ మాట్లాడలేదు. అంతపనీ చేస్తానని భయపడిందని అమ్మ కళ్లు చూస్తే అర్థమయింది నాకు. రాధను సినిమాకైనా, బజారుకైనా తీసుకువెళ్ళాలంటే నేనే గతి. ఆ సంగతి నాకు తెలుసు.

ఆ తర్వాత రెండ్రోజులకు దాన్ని నిజంగానే బజార్లో పడిపోయేలా తోసేసి—"దిక్కున్నచోట చెప్పుకోవే—" అన్నాను.

ఆరాత్రి భోజనాలదగ్గర అమ్మ నాన్నతో—"రవి బుద్ధి లేం బాగుండలేదండీ. ఇలాగేఉంటే పెద్దయ్యేసరికి వీడు

శైలుపాలు కావడం తథ్యం—'' అంది.

నాన్న నవ్వి ఊరుకున్నాడు. నేనేమీ భయపడలేదు. ఒక నేరం చేశాక పశ్చాత్తాపపడడం నా అలవాటు కాదు. ప్రతీకారం నాకు అంతులేని సంతృప్తిని ప్రసాదిస్తుంది.

## 2

అప్పుడు కాలేజీలో బియ్యే రెండో సంవత్సరం చదువుతున్నాను. నా చెల్లెలు ఉమ బీయస్సీ మొదటి సంవత్సరం చదువుతోంది. నా క్లాసులో ఇంకో ఊర్నించి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ తీసుకునివచ్చి జాయినయ్యాడు మూర్తి. క్లాసులో చేరిన రెండు రోజుల్లోనే మూర్తికీ నాకూ బాగా స్నేహం కలిసింది.

మూర్తి పూర్తిగా నా వంటివాడు కాదు. అతను వయస్సులో నాకంటె ఒక సంవత్సరం పెద్ద, ఒడ్డూ, పొడుగూ వుండి బాగుంటాడు. అతనికీ ఆవేశం వుంది. కానీ తొందరపడడు. ఆవేశాన్ని చల్లార్చుకోవడం అతనికి బాగా తెలుసు. అనుకున్న పని సాధించాలన్న పట్టుదలకూడా అతనికి వుంది. చదువుమీద శ్రద్ధలేదతనికి కానీ డిగ్రీ సంపాదించాలన్న పట్టుదల మాత్రం వుంది. అందుకే చదువుతున్నాడు.

మూర్తి నా ఆలోచనాసరళిని మార్చడానికి ఎంతగానో ప్రయత్నిస్తూండేవాడు. కానీ అతని హితబోధనలు నాకు ఎక్కేవికావు.

ఒకసారి క్లాసులో ఒక కుర్రాడికీ నాకూ ఏదో విషయంమీద గొడవొచ్చింది. మాటా మాటా అనుకుని చాలా దూరం వెళ్ళాం. నా క్లాసుమేటుకి కోపంవచ్చి-

"ఎప్పుడైనా రాజేశ్వరీ టాకీసుకి రాకపోవు. అప్పుడు చూద్దువుగాని నా ప్రతాపం–" అన్నాడు.

వాడు రాజేశ్వరీ టాకీసు ప్రొప్రయిటర్ కి చుట్టం. వాడి ఇల్లుకూడా ఆ ప్రాంతంలోనే ఉంది. వాడి అన్న పెద్ద రౌడీ అని అంతా చెప్పుకుంటారు.

వాడి మాటలకు నాకు ఒళ్ళు మండిపోయి–"నా ప్రతాపం చూపించడానికి రాజేశ్వరీ టాకీసుదాకా వెళ్ళక్కర్లేదు. ఇక్కడే చూపిస్తాను, చూస్తావా?" అంటూ వాడి కాలరు పట్టుకుని ఒక్క తోపు తోశాను. వాడు కలయబడ్డాడు. కానీ నా చేతిలో వాడే ఎక్కువ దెబ్బలు తిన్నాడు. అసలు రక్తాలు కారిపోవలసిందే కానీ మూర్తి కలగజేసుకుని బలవంతంగా మమ్మల్ని విడదీశాడు.

"అనవసరంగా తొందరపడకూడదోయ్ రవీ—ఈ వేళ వాణ్ణి కొట్టావ్ గానీ రేపు తప్పక పశ్చాత్తాపపడతావ్. రేపటి పశ్చాత్తాపాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ రోజు శాంతంగా ఉండటం నేర్చుకోవాలి–" అన్నాడు మూర్తి నాతో.

"పశ్చాత్తాపమన్నది నా జీవితంలో ఉండదు. నేను నమ్మిన ఆశయాలకోసం, నేను ప్రేమించే వ్యక్తులకోసం నా ప్రాణాలివ్వాల్సి వచ్చినా వెనుకాడను. నా ఆశయాల మీద, ప్రేమమీద ఎవరైనా దొంగదెబ్బ వేశారా—వాళ్ళు చావుదెబ్బ తింటారు. పశ్చాత్తాపం ఎందుకు?" అన్నాను.

"ఇప్పుడలాగే అంటావ్. కానీ ఓ రెండ్రోజులాగి చూడు" అన్నాడు మూర్తి.

రెండ్రోజులు కాదు, పదిరోజులు గడిచినా నాకు పశ్చాత్తాపం కలగలేదు.

మూర్తిమాత్రం — "కలిగేవుంటుంది. కానీ నేను ముందుగానే అలా అని వుండడంవల్ల పశ్చాత్తాప పడ్డానికి నీ మనసొప్పుకోడం లేదనుకుంటాను" అన్నాడు.

నా మనసు మూర్తికి అర్థంకాలేదు. అతని మనసు నాకూ అర్థంకాలేదు.

ఒకరోజు మూర్తి దూరంగా అమ్మాయిల మధ్యకు చూపించి—"ఆ అమ్మాయి చాలా నచ్చిందోయ్ నాకు" అన్నాడు.

"అయితే" అన్నాను.

"నచ్చింది. అంతే-రోజూ ఒక్కసారైనా ఆమెను చూడలేకపోతే నా ప్రాణం విలవిల్లాడిపోతుంది—" అన్నాడు మూర్తి.

అతన్నంతగా ఆకర్షించిన ఆ అమ్మాయెవరా అని పరిశీలనగా చూశాను. అక్కడ చాలామంది వున్నారు. మూర్తి ప్రత్యేకంగా చూపించాక నా రక్తం మరిగింది.

"ఇదే మరొకడూ మరొకడూ అయితే ఏం చేసేవాడినో తెలియదు. నువ్వు కాబట్టి సరిపోయింది. ఆ అమ్మాయి నా ప్రాణానికి ప్రాణంగా చూసుకుంటున్న నా చెల్లెలు ఉమ" అన్నాను.

మూర్తి పెద్దగా ఆశ్చర్యపడ్డట్లు కనపడలేదు — "కావచ్చు కానీ యిప్పుడు నేనన్న మాటల్లో తప్పేముంది?" అన్నాడు.

"తప్పులేదూ నా చెల్లెల్ని నా కళ్ళెదురుగుండా బాగుందనీ, ఆమెను చూడలేకపోతే ప్రాణం విలవిల్లాడిపోతుందనడం..." ఆవేశంతో నాకూ మాటరాలేదు.

"అయితే నీ కళ్ళెదురుగుండా కాక ఇంకెవరితో అయినా బాగుందని అనవచ్చా?"

“మూర్తీ హద్దుమీరకు. ఈ విషయంలో వాదించడం నాకిష్టంలేదు. నా చెల్లెలని తెలియక పొరపాటు చేశావ్. ఇంక ఈ విషయం గురించి మాట్లాడకు.”

“రవీ—నేనూ నీ మిత్రుణ్ణి. నీ దగ్గర్నుంచే కొన్ని విషయాలు నేర్చుకొన్నాను. నా మనసుకు నచ్చిన పని చేసేక అది పొరపాటని ఒప్పుకోవడమూ, అందుకు పశ్చాత్తాపంపడడమూ తప్పని నువ్వే అన్నావు” అన్నాడు మూర్తి.

ఏం మాట్లాడాలో నాకూ తోచలేదు. “నా మాటలు నా కప్పగించడంకోసమా యిందాకటి నీ ప్రవర్తన?” అన్నాను.

“కాదు. కానీ నీ విషయంలో పశ్చాత్తాపం అనవసరమనుకున్నప్పుడు ఎదుటివాడి విషయమూ అంతేనని గ్రహించాలి నువ్వు.”

నాకోక్రపం వచ్చింది “మూర్తీ నో మోర్ డిస్కషన్!” అన్నాను.

“సరే-కానీ చిన్న హెచ్చరిక—అందాన్ని చూడాలనుకోవడం, మెచ్చుకోవడం తప్పుగా భావిస్తే అది నీ అజ్ఞానం...”

“అజ్ఞానం కాదు. నీకూ నాలా ఓ చెల్లెలుంటే నా బాధ నీకర్థమయ్యేది?” అన్నాను.

“అయితే కాలేజీలో ఏ ఆడపిల్ల అందాన్నీ నువ్వు చూసి ఆనందించవా? నీ చెల్లెలికి తప్ప ఇంకెవరికీ అన్నలు లేరనే అనుకుంటున్నావా?” అన్నాడు మూర్తి.

“ఎందుకుండరు? చాలామంది ఆడపిల్లలకన్నయ్యలుంటారు. కానీ వాళ్ళకి వారి అన్నయ్యల అవసరం

నా కారణంగా కలగదు" అన్నాను నమ్మకంగా.

ఆ తర్వాత మా స్నేహంలో కొన్ని రోజులపాటు ఏదో వెలితితోచింది.

## 3

అనుకోకుండా ఒకరోజు నాకూ, శశికళకూ పరిచయ మయింది. కాలేజీలో ఒక టర్నింగ్ దగ్గర యిద్దరం గుద్దు కున్నాం. ఆ అమ్మాయి చేతిలోని పుస్తకాలు క్రింద పడ్డాయి.

ఆ పుస్తకాలు తీసి అందిస్తూ "సారీ!" అన్నాను.

"తప్పు నాదికూడా వుందనుకుంటాను. నేను దారి చూడకుండా పుస్తకం చదువుతూ వస్తున్నాను—" అందామె.

శశికళ నాకూ తెలుసు. మనిషి ఆకర్షణీయంగా వుంటుంది. బీయస్సీ ఫస్టియరు చదువుతోంది కానీ ఉమ క్లాసు కాదు. వయసెంతో తెలియదు కానీ చూడ్డానికి నాకంటె చిన్నపిల్లలా వుంటుంది. కాస్త అల్లరిపిల్లని ఉమ అంటూండేది.

ఆమె గురించి అంతవరకూ నేనాట్టే ఆలోచించలేదు కానీ ఈ రోజుమాత్రం అంత దగ్గరగా ఆమెను చూస్తుంటే ఏదోలా అనిపించింది.

పుస్తకాలందుకుని "థాంక్స్" అందామె. నాకు ఏమనాలో తోచక యిబ్బందిగా నవ్వి ఊరుకున్నాను. ఆమె వెళ్ళిపోయింది. మళ్ళీ ఏదోలా అనిపించింది నాకు.

మా ఇద్దరికీ పరిచయం జరిగినట్టు భావించాను నేను. ఇప్పుడు నా ఆలోచనల్లో శశికళ అందం—ఆమె నాగురించి ఏమనుకుంటుందోనన్న భావం చోటు చేసుకున్నాయి. ఆమెపట్ల నా ఆకర్షణ పెరిగింది.

ఆ తర్వాత రెండ్రోజులకొక్కబోలు మధ్యాహ్నం ఫస్టవర్ క్లాసులేదు. లెక్చరర్ రాకపోవడంవల్ల "సెకండవర్ కెలాగూ రావాలిగదా ఈలోగా ఎక్కడికి పోతాం. కాసేపు లైబ్రరీలో గడిపివద్దాం" అన్నాడు మూర్తి.

మూర్తి ఉద్దేశ్యం చూచాయగా నాకు తెలుసు. లైబ్రరీకి వెళ్ళే దారిలోనే సైన్సు లాబరేటరీ వుంది. అక్కడ అమ్మాయిలు ప్రయోగాలు చేసుకుంటూండగా చూడవచ్చునని చాలామంది అబ్బాయిలు అనుకుంటూంటారు. వాళ్ళలో ఉమకూడా వుంటుందనే బాధ నాకు కాస్త కలుగుతుండేది. ఈ రోజుమాత్రం అప్రయత్నంగా ఊఁ అన్నాను కారణం శశికళ కావచ్చు. ప్రాక్టికల్సులో అన్ని గ్రూపుల అమ్మాయిలూ కలుస్తారు.

ఇద్దరం లాబరేటరీని క్రాస్ చేస్తూండగా చటుక్కున శశికళ వచ్చింది లాబ్ నుంచి బయటకు. నన్ను చూస్తూనే ఆమె కళ్ళలో వెలుగు కనిపించింది — "హలో!" అందామె.

ఆ పలకరింపు నాకో, మూర్తికో అర్థంకాలేదు నాకు.

"మిమ్మల్నే!" అందామె. ఆమె చూపులు నా వైపే వున్నాయి. ఆమెవి మెల్లకళ్ళుకావు.

నాకు చాలా సంతోషమయింది. నన్ను మళ్ళీ ఆమె పలకరిస్తుందని అనుకోలేదు నేను "హలో!" అన్నాను.

ఆమె నన్ను సమీపించి "ఏమీ అనుకోకపోతే మీ పెన్నివ్వగలరా నాకు" అంది.

నేనాశ్చర్యపడినా అప్రయత్నంగా జేబులోంచి పెన్ను తీశాను. అదామె అందుకుని "చాలా థాంక్సండీ పెన్నులో

ఇంకయిపోయింది. ఇంతమందిలో ఒక్కరు కూడా క్లాస్ మేట్స్ హెల్ప్ చేయలేదు...'' అని మళ్ళీ లాబ్ లోకి వెళ్ళిపోయింది.

''ఏమదృష్టమోయ్ నీది'' అన్నాడు మూర్తి.

''అదృష్టమేమిటి?'' అన్నాను ఈ లోకంలోకి వస్తూ.

''అందమైన ఆడపిల్ల నిన్ను పెన్నడిగింది'' అన్నాడు మూర్తి.

''అడిగితే__?''

''మనమిద్దరం వుండగా__ఇద్దరిలోనూ పెన్నడగ డానికి నిన్నే ఎంచుకుంది?.''

''అయితే?''

''అర్థంకాలేదా_పెన్ను కావాలనడం ఒకవంక_నిన్ను ప్రేమిస్తోంది'' అన్నాడు మూర్తి.

''డోంటాక్ రబ్బిష్'' అన్నాను కానీ మూర్తి ఇంకా మాట్లాడితే బాగుండుననిపిస్తోంది.

''ఏం__శశికళ నీకు నచ్చలేదా?'' అన్నాడు మూర్తి.

''శశికళకేం బంగారుబొమ్మ. ఆమె నచ్చలేదని ఎవరన గలరు? నాకు నచ్చనిది నీ మాటలు!'' అన్నాను.

''నా మాటలు నీకు నచ్చకపోవచ్చు కానీ నీ మాటలు నాకింకా ఆశ్చర్యంగా వున్నాయి. ఓ పరాయి ఆడపిల్లను పట్టుకుని బంగారుబొమ్మంటున్నావ్ తప్పు కాదూ? శశికళ అన్న నీ మాటలు వింటే ఎంత బాధపడతాడు?'' అన్నాడు మూర్తి.

దెబ్బ తిన్నాను ''నువ్వడిగావు కాబట్టి చెప్పాను కానీ పనిగట్టుకుని అనలేదు కదా'' అన్నాను.

"బాగుంది. నేనుమాత్రమేం అడిగాను? శశికళ నీకు నచ్చలేదా అన్నాను. అంతమాత్రాన ఆ అమ్మాయి బంగారుబొమ్మ అని వర్ణించాలా? నీ కనవసరం అలాంటి ప్రశ్నలడగడం తప్పు-అని అంటే సరిపోయేదిగదా— నీ మనసులో ఏ మూల శశికళ అందాన్ని బేరీజు చేస్తున్నావు. అందుకనే అడిగిన వెంటనే ఆమె బంగారు బొమ్మని చెప్పగలిగావ్ అవునా?"

"మూర్తీ ఎందుకిలా నన్ను సాధిస్తావ్? ఇంకా ఎంత కాలం నన్నిలా సాధిస్తావ్? మాటల్లో నిన్ను గెలవలేను నేను" అన్నాను.

"అయితే ఒప్పేసుకో అందంగావున్న ఆడపిల్ల బాగుందని మెచ్చుకోవడం తప్పుకాదని. అప్పుడు నిన్ను వదిలి పెడతాను" అన్నాడు మూర్తి.

"తప్పొప్పుకోవడం నా జాతకంలో లేదు" అన్నాను మొండిగా.

"అయితే నీ కర్మ" అన్నాడు మూర్తి.

## 4

మళ్ళీ వారంరోజులకు శశికళ నన్ను లైబ్రరీలో కలుసుకుని పలకరించింది. ఆమెను చూడగానే ఈసారి నాకు ముందుగా పెన్ను గుర్తుకువచ్చింది.

"హలో" అందామె.

"హలో" అన్నాను నేను. పెన్ను అన్నమాట నాలిక చివరిదాకా వచ్చింది.

"మీ ఆరోగ్యం బాగుండటంలేదా?" అంది శశికళ.

"అదేం అలా అడిగారు?"

"చిక్కినట్లు కనిపిస్తుంటేనూ."

ఇదే సమయం అనిపించింది "పెన్ను మీదగ్గరుండి పోయింది కదా బెంగెట్టుకున్నాను" అనేశాను.

"గుర్తుచేస్తున్నారా?"

"చిక్కిపోవడానికి అంతకుమించి కారణం కనపడ్డం లేదు నాకు."

"చాలా తమాషాగా మాట్లాడతారండీ మీరు?" అంటూ నవ్వింది శశికళ. ఆ నవ్వు చాలా అందంగా, మనోహరంగా వుంది.

"మీకు నామీద బాగా అభిమానముండి వుండాలి. అభిమానమున్న వాళ్ళకే మనుషులు చిక్కినట్లు కనబడతారట" అన్నాను కాస్త ధైర్యంచేసి.

"మీరు పొగుడుతున్నారు నన్ను. అయినా సరే మీ పెన్ను తిరిగివ్వను నేను" అంది శశికళ.

నాకు నవ్వు వచ్చింది "మీ ఇష్టం" అన్నాను.

"ఎందుకో చెప్పలేనుగానీ మీరంటే నాకు ఇష్టం ఏర్పడింది. మీ వస్తువులేవైనా నా దగ్గరుంచుకోవాలనిపించింది. అందుకే మీ పెన్ను తీసుకున్నాను" అంది శశికళ.

ఉలిక్కిపడ్డాను. పెన్ను పోయిందని కాదు. ఆ అమ్మాయి నిజంగానే నన్ను ప్రేమిస్తున్నందుకు. అది ఎటువంటి ప్రేమ అయితేనేం నాలోని ఏదో ఒక ప్రత్యేకత ఆమె నా పట్ల ఆకర్షితురాలైంది.

"చాలా థాంక్స్" అన్నాను. నా శరీరం గాలిలో తేలిపోతోంది.

"ఇలాంటి లైబ్రరీలో మాటలు సరిగా సాగవు. మీ రెక్కడికి రమ్మంటే అక్కడకు వస్తాను. మనం ఒకసారి మనసువిప్పి మాట్లాడుకోవాలి" అంది శశికళ.

నా ఆశ్చర్యం పరాకాష్ఠనందుకుంది "ఏమిటి మీ నేది?'' అన్నాను.

"ఆశ్చర్యాన్ని మరిచిపొండి. ఆనందాన్ని అణచిపెట్టి స్తవానికి రండి. బీచీ, సినిమా, పార్కు వీటిలో గా కేది కన్వీనియంటో చెప్పండి!'' అంది శశికళ.

ఆమె మాటలు సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం నపడింది నాకు. అప్పుడు వాస్తవంలోకి వచ్చాను. జంగా శశికళను కలుసుకోవాలంటే ఎక్కడ?

బీచీదగ్గర ఎవరైనా చూడవచ్చు. పార్కులో కూడా టువంటి గ్యారంటీ ఏమీలేదు. సినిమాలో అయితే క్షణ ఎక్కువ. ఒకవేళ ఎవరైనా చూసినా కాక ళీయం అనుకోవచ్చు. అయితే సినిమాకెప్పుడు ళ్ళాలి. ఫస్టుషోకి వెళ్ళాలంటే ఇంట్లో చెప్పాలి. ఇంట్లో బితే రాధ సిద్ధమవుతుంది. సెలవురోజున మ్యాట్నీ యినా రాధ తప్పదు. అందువల్ల క్లాసున్నరోజున ఎగేసి గ్యాట్నీ కెళ్ళాలి.

"కాలేజీ ఎగేసి మ్యాట్నీ కెళ్ళాలి'' అన్నాను.

"చాలాదూరం ఆలోచించగలరు మీరు?'' అని న్వింది శశికళ "ఆడపిల్లని కాబట్టి ఇలా కలుసుకోవడం ాకంటే నాకే కష్టం. అందుకని వీలు చూసుకుని నేనే బుతాను...''

ఆ మర్నాడే శశికళ నన్ను కలుసుకుని రెండు టికె చ్చింది, రామకృష్ణాలో బాల్కనీలో బుక్ చేసిందామె. ప్పుడు రామకృష్ణాలో బాగా పాత తెలుగుసినిమా ఆడు ంది. బాల్కనీలో జనమెట్టే వుండరు. అందులోనూ ్యాట్నీకి. శశికళ తెలివితేటల్ని మనసులోనే అభినం

దించుకుని ఒక టికెట్ ఆమెకు తిరిగిచ్చేసి "ఇద్దరం విడి విడిగా వెళ్ళి అక్కడ కూర్చుందాం" అన్నాను.

మనసులో ఏదో థ్రిల్ ఊహించుకుంటున్నాను. శశికళ నాతో ఏం మాట్లాడుతుంది? ఆమె నన్ను ప్రేమిస్తున్న పక్షంలో నేనేం చేయాలి? చదువయ్యే వరకూ పెళ్ళి వాయిదా వెయ్యాలా? అసలు మా ప్రేమ పెళ్ళికి దారి తీస్తుందా, తియ్యదా? అయినా ఇంకా ఏణ్ణర్థం చదువుంది నాకు. ఆ తర్వాత ఎప్పటికి ఉద్యోగం దొరుకుతుందో? ఇప్పట్నుంచీ పెళ్ళేమిటి?

ఇది అంటూ ఒక నిర్ణయానికి రాలేకపోతున్నాను కానీ థియేటర్‌కు మాత్రం వెళ్ళాను. హాల్లో జనం బాగా పల్చగా వున్నారు. నా పక్క సీటు శశికళకోసం ఖాళీగావుంది. ఒకరిద్దరు ఆడవాళ్ళు నాకు బాగా దూరపు వరుసలో కూర్చుని వున్నారు.

శశికళ ఇంకా రాలేదు. ఇంత పాత సినిమాకు అడ్వాన్స్ బుకింగ్ ఉండదు. ఉదయమే దీనికి టికెట్స్ సంపాదించగలిగిందంటే ఆమెకు మంచి ఇన్‌ఫ్లుయన్స్ వుండివుండాలి. అంటే శశికళ బాగా డబ్బున్నవాళ్ళ అమ్మాయా?

కాలేజీలో ఉమతోసహా అంతా డబ్బున్న వాళ్ళ పిల్లలాగే కనిపిస్తారు. అసలు నిజాలు ఇళ్ళకు వెడితే గానీ తెలియవు. ఈ రోజు శశికళ గురించిన విషయాలు కొన్ని రాబట్టాలి.

హాల్లో లైట్లు ఆరాయి. స్లైడ్స్ వేయడం ప్రారంభమయింది. ఇంకా శశికళ రాలేదు.

అడ్వర్టయిజుమెంట్సు మొదలయ్యాయి. న్యూస్ రీలు కూడా మొదలయింది. ఇంకా శశికళ రాలేదు.

అసలు శశికళ వస్తుందా? నాకూరికే మస్కా ఇచ్చిందా నాకు మస్కా ఇవ్వవలసిన అవసరం ఆమెకేముంది?— వగైరా ఆలోచనలతో నా బుర్ర నిండిపోయింది.

న్యూస్‌రీల్ ఆసక్తికరంగానే ఉంది. ఒక్కక్షణం శశికళను మరచిపోయాను. అప్పుడే నా భుజంమీద ఎవరిదో చేయిపడి ఉలిక్కిపడ్డాను. ఆశగా పక్కకి తిరిగాను.

"హలో మిస్టర్ రవీ—" అంటూ ఆశ్చర్యాన్ని ప్రకటించిన ఆ కళ్ళు శశికళవి కావు. కనీసం స్త్రీవైనా కాదు. ఒక పురుషుడివి. ఆ పురుషుడు మూర్తి.

మూర్తి కూడా నాకులాగే సినిమాకు వచ్చివుంటాడు—క్లాసులెగేసి. అయితే ఇప్పుడు శశికళ వచ్చి నా పక్కన కూర్చుంటుందని అతనికి తెలియదు. అందుకే నా పక్క సీట్లో కూర్చున్నాడు—అనుకున్నాను.

న్యూస్‌రీల్ అయిపోయి సినిమా మొదలైనా శశికళ రాలేదు.

మాటిమాటికీ నేను అటూఇటూ చూస్తూండడం గమనించిన మూర్తి—"శశికళకోసమా?" అన్నాడు.

ఆశ్చర్యపడి—"ఎలా తెలుసు?" అన్నాను.

"శశికళే నాకు సినిమా టికెట్ ఇచ్చింది—"అన్నాడు మూర్తి.

అంతా అయోమయంగా అనిపించింది. సినిమామీద దృష్టి లేదు—"ఏమిటి నువ్వనేది?" అన్నాను.

"నా కోరికమీద నీ కళ్లు తెరిపించడానికి శశికళ నాటకమాడింది. ఆమె నా బంధువులమ్మాయి. కజిన్ సిస్టర్! శశికకు నేను అన్నని. ఒకసారి అన్నావుగా—నీ

కారణంగా ఏ ఆడపిల్లకీ తన అన్నయ్య అవసరం రాదని నీ నమ్మకమని. కానీ నే నిప్పుడు శశికళ అన్నగా ఇక్కడకు వచ్చాను. వయసులోవున్న పెళ్ళికాని ఆడ పిల్లలను సినిమాకు రమ్మనడం తప్పుకదూ?"

నాకు కళ్లు తిరిగినట్లయింది–మైగాడ్–ఇదంతా నాటకమా? ఎంత దారుణంగా మోసపోయాను. మూర్తి తన పట్టుదలగురించి ఇదివరలో చాలా పర్యాయాలు నాకు చెప్పాడు. కానీ ఇంత పగడ్బందీగా పథకంవేసి నన్ను ఓడిస్తాడని అనుకోలేదు. ఇది ఓమిటకాదు. అవమానం!

"నా తప్పేమీ లేదు. ఆమె నన్ను సినిమాకు రమ్మంది___"

"బాగుంది. తను రమ్మంటేమాత్రం–నువ్వు నచ్చచెప్ప వద్దూ–అందులోనూ బాధ్యత తెలిసిన అన్నవి నువ్వు!" అన్నాడు మూర్తి.

చాలా సూటిగా తగిలింది నాకు–"మూర్తీ–చిలికి చిలికి చెప్తున్నావ్. ఎవరి అభిప్రాయం వాళ్ళది. నేను నీ అభిప్రాయాల జోలికి రాను."

"అలాగన్నావ్ బాగుంది. అయితే ఒక ఆడపిల్ల అందంగావుంటే అని మెచ్చుకోవడం తప్పుకాదని ఒప్పుకుంటావా?" అన్నాడు మూర్తి.

నా రక్తం మరిగింది. –"ఒప్పుకోను–" అన్నాను. అది నా చెల్లెలికి సంబంధించిన విషయం.

మూర్తి దెబ్బతిన్నట్లున్నాడు–"ఎందుకోయ్–నీమూర్ఖపు పట్టుదల. వాస్తవాన్ని గ్రహించుకోవేం?" అన్నాడు.

"నాకు తెలిసినదీ, నాకు తోచినదీ, నేను చెప్పేదీ, నేను చేసేదీ–అదే వాస్తవం నాకు. ఒకరి మాటలు విని

తప్పు ఒప్పుకోవడమూ, పశ్చాత్తాపపడడమూ నా జాత కంలో వుండదు. ఉండబోదు. నీ విషయంలో కూడా అంతే—ఇంక మనకు స్నేహం పొసగదు," అన్నాను.

మూర్తి నా చేయి పట్టుకుని—"ఇంత ఆవేశం తగదు నీకు. నావంటి మంచి స్నేహితుణ్ణి పోగొట్టుకున్నందుకు తర్వాత పశ్చాత్తాపపడతావ్" అన్నాడు.

"అదిగో ఆ ముక్కే నా ఒళ్ళు మండిస్తోంది. పశ్చా త్తాపం ఎందుకు? దేనికి?"

"నిదానంగా వింటానంటే అన్నీ వివరంగా చెబు తాను."

"ఇంక వినడంలేదు. మనిద్దరికీ ఇకముందు మాటలుం డవు" అని పోల్చించి లేచాను.

"అన్నట్లు చిన్నమాట ఇదిగో నీ పెన్ను శశికళ నీకు తిరిగిచ్చేయమంది" అన్నాడు మూర్తి.

పెన్ను అందుకుంటూంటే నా గుండెలు ఎవరో పిండు తున్నట్లనిపించింది. జీవితంలో ఇంత దారుణావమానానికి గురవుతానని నేననుకోలేదు.

# 5

నా గుండెల్లో ఎగసిపడే జ్వాలల నణచడానికి ప్రతీ కారం తీర్చుకోవాలి. ప్రతీకారానికి మార్గం తెలిసింది. కానీ అందుకు రెండువందలు కావాలి.

రెండువందలెలా సంపాదించాలి?

అమ్మకు నగలున్నాయి. నాన్నకు పర్సుంది. కానీ దొంగతనం నాకిష్టంలేదు. అయితే ఏంచేయాలి?

మా క్లాసులో రమేష్‌అని ఒకడున్నాడు. వాడు కారు డ్రైవర్ కొడుకు. కానీ చాలా జల్సాగా ఖర్చుచేస్తాడు. డబ్బెక్కడిదని అడిగితే పార్ట్‌టైం జాబ్ చేస్తున్నా

నని నువ్వు చేస్తావా అనడిగేడు. నేనప్పుడుత్సాహం చూపించలేదు. ఇప్పుడా రమేష్‌గాడిని కదిపి చూడాలి.

నా ఆసక్తి గురించి వింటూనే "ఓస్ ఇంతేనా?" అన్నాడు రమేష్. నా అవసరాన్ని వాడంత చిన్న చూపు చూడడం నాకానందాన్నే కలిగించింది. సులువుగానే పనైపోతుందని దానర్థం.

"త్వరగా చూడాలోయ్" అన్నాను.

"కనుక్కొని రేపు చెబుతాను. కానీ నువ్వు కాస్త సాహసం చేయాల్సొంటుంది" అన్నాడు రమేష్.

"అన్నింటికీ సిద్ధమే" అన్నాను.

మర్నాడు రమేష్ ఒక అడ్రసిచ్చి నన్ను వెళ్ళి కలుసుకోమన్నాడు. సాయంత్రం కాలేజీ వదలగానే ఆ అడ్రస్‌కు వెళ్ళాను. అదో చిన్న గది. అందులో ఒకతనున్నాడు. నన్ను చూసి పలకరించి వివరాలడిగి తెలుసుకుని "ధైర్యముందా?" అన్నాడు.

"ఉంది" అన్నాను.

"తర్వాత విచారించకూడదు ఇలాంటి పనెందుకు చేశాననని!" అన్నాడు.

"అలాంటివి నాకు చేతకాదు..." అన్నాను.

పని చెప్పాడు. అది స్మగ్లింగ్‌కు సంబంధించిన వ్యవహారం. ఒక వస్తువును ఒకచోటనుంచి ఇంకో చోటుకు జేరవేయాలి. అందుకు పోలీసుల దృష్టిలో వున్నవారు కాకుండా కొత్త మనుషులు కావాలి. ఇతనలాంటి మనుషుల్ని కుదిర్చే బ్రోకరు. అతనికెంత వస్తుందో తెలియదు కానీ నాకు మూడొందలయాభై ఇస్తానన్నాడు.

రామారావు బట్టలషాపులో నేనొక గుర్తుచూపించాలి

ఆగుర్తు ఈ బ్రోకర్ ఇచ్చాడు. అది చూడగానే అక్కడ నాకొక పెట్టె అందజేయ బడుతుంది. అది తీసుకుని అలంకార్ లాడ్జిలో ఇరవయ్యో నెంబరు వ్యక్తికి అందచేయాలి అన్న టైముకి వస్తువు చేరకపోతే నా ప్రాణాలు నాకు దక్కవు. పాముతో చెలగాటం. బ్రోకర్ దగ్గర తెలుసుకున్న విషయం యిది!

ఎక్కడా ఎవరికీ అనుమానం రాకుండా — తెలివిగా వ్యవహారం నడపాలి నేను.

అడ్వాన్సుగా రెండొందలిచ్చాడు బ్రోకరు. అలంకార్ లాడ్జిలో నాకో గుర్తు లభిస్తుంది. అదిచూసే బ్రోకరు నాకింకో నూటయాభయి రూపాయలిస్తాడు.

నాకిది పెద్ద కష్టమనిపించలేదు. సులువుగానే సాధించుకు వచ్చాను. మూడొందలయాభయి రూపాయలు సంపాదించాను. పని పూర్తయి డబ్బంతా నా చేతిలో పడేసరికి టైము రాత్రి ఎనిమిదయింది. అంత లేటుగా యింటికి వెళ్ళినందుకు అమ్మ పెద్ద రాద్ధాంతం చేస్తుంది. అందుకున్నదల్లా ఒక్కటే ఉపాయం!

బజార్లో పాతిక రూపాయలు పెట్టి బొమ్మ ఒకటి కొన్నాను. నిలబడ్డప్పుడు చూస్తుంది. పడుకో బెడితే కళ్ళు మూస్తుంది. సజీవకళతో వున్న ఆ బొమ్మను రాధ కోసం కొన్నాను.

ఇలాంటి సందర్భాలలో నాకెంతో బాధగావుంటుంది నేను ప్రాణానికి ప్రాణంగా చూసుకునే నా చెల్లెలు కోసం ఏమీ చేయలేను. మనసులో అసహ్యించుకునే రాధకోసం చాలా చేయాలి.

ఇంటికి వెడుతూనే రాధదగ్గరకు వెళ్ళి ప్రేమగా కబు

ర్లాడి—దానికి బొమ్మ యిచ్చేశాను. అది చాలా సంబర పడిపోయింది. నేను చేసినపనికి అమ్మ ముఖంకూడా వెలిగి పోయింది. ఒక్క నిముషం పోయాక—'ఎంతరా అది?' అనడిగింది.

"పాతిక రూపాయలు" అన్నాను.

అమ్మ ముఖంలో రంగులు మారాయి. "ఎక్కడిదిరా నీకంత డబ్బు?"

"మీరు నాకిచ్చే డబ్బులో అప్పుడో పావలా' అప్పుడో అర్ధా మిగుల్చుకుని పోగుచేశాను. రాధకీబొమ్మ కొనాలని అయిదారు నెల్లనించి అనుకొంటున్నాను..." బొంకేశాను.

అమ్మింకేం మాట్లాడలేదు. ఆ రాత్రికింట్లో యింకేమీ రాద్ధాంతం జరుగలేదు.

మర్నాడు మాత్రం అమ్మకు ముందుగానే చెప్పేశాను. సాయంత్రం వచ్చేసరికి కాస్త ఆలశ్యమవుతుందని. అమ్మ ఏమీ అనలేదు. రాధ బొమ్మ ఎఫెక్టింకా ఉందనుకుంటాను.

మధ్యాహ్నం రెండు గంటలకి కాలేజీ ఎగేసి వెళ్ళాల్సిన చోటుకు వెళ్ళాను.

"రండి బాబూ రండి. డబ్బు తెచ్చారా—" అంది దమయంతి.

దమయంతి ఆ ఊళ్ళో చాలామందికి తెలుసును. రస గుల్లాలాంటి ఆడపిల్లలను సరఫరా చేయడంలో ఆమెకు ఆమేసాటి అని అంతా చెప్పుకుంటారు. అయితే నాకు ఆమె దగ్గరున్న రసగుల్లాలక్కర్లేదు కాబట్టి వెళ్ళి నాకోరిక తీర్చగలదేమో అడిగాను.

"ఇలాంటి పనులింతవరకూ చెయ్యలేదు బాబూ—కానీ డబ్బిస్తే పెద్దకష్టంకాదు."

"ఎంత కావాలేమిటి?"

"నాలుగయిదొందలు కావాలి..."

"చదువుకుంటున్న కుర్రాణ్ని నేను. అంత డబ్బెక్కణ్నించి తేగలను? కావాలంటే ఆ పిల్లను మరి కాసేపు వదిలేస్తాను..." అన్నాను.

దమయంతి మాట్లాడకుండా ఒప్పుకుంది. నేను చెప్పిన బేరం రెండువందలు.

ఇప్పుడు రెండువందలూ దమయంతి కిచ్చాను. దమయంతి తన పథకం చెప్పింది. తన తాలూకుపిల్ల కాలేజీకి వెళ్ళిందట. ఆడపిల్ల కాడపిల్లను నమ్మించటం చాలా సులభంకదా. మంచి మాటలు చెప్పి యిక్కడకు తీసుకువస్తుంది. ఆ తర్వాత తన ఇష్టం.

"ఆగదిలో ఉండండి బాబూ- ఇంకో గంటలో వచ్చేస్తుంది పిల్ల" అంది దమయంతి.

నాకు ఆవేశంగావుంది. కానీ ఈ ఆవేశం కొత్తరకంగా వుంది. గదిలోకెళ్ళాను. ఏర్పాట్లు చాలా బాగున్నాయి. నాలో ఉద్రేకం రేగుతోంది.

# 6

నిజానికి నేను గంటసేపు ఎదురు చూడవలసిన అవసరం లేకపోయింది. నా గదిలోకి అరగంటలోనే శశికళ అడుగు పెట్టింది. ఆమె వెనకే దమయంతి మాటలు వినిపించాయి—"చూశావుగా, పిల్లా! నా దగ్గరున్న రౌడీలు కాలాంతకులు. లోపల బుద్ధిగా మసలుకోకపోతే నీకు దేహశుద్ధి జరగడమే కాదు. పరువుకూడా గంగ పాలవుతుంది—."

ఆ మాటలు వెనకే తలుపులు మూసుకున్నాయి. నా కళ్ళూ శశికళ కళ్ళూ కలుసుకున్నాయి.

శశికళ కళ్ళలో ముందు ఆశ్చర్యం, ఆ వెనుక దిగులూ కనపడ్డాయి.

"కమాన్" అన్నాను కర్కశంగా.

ఆమె నాదగ్గరకొచ్చి "ఇది చాలా మోసం!" అంది.

"మోసం కాదిది. మోసానికి ప్రతీకారం. త్వరగా బట్టలువిప్పు" అన్నాను.

"మిస్టర్ రవీ, నా తప్పులు క్షమించు. ఎవరినయినా ఆటలు పట్టించడం నాకు సరదా. ఆ బలహీనత నాస రాగా తీసుకొని నా కజిన్ బ్రదర్ మూర్తినన్ను నీమీదకు ఉసిగొల్పాడు. తర్వాత ఎంతగానో పశ్చాత్తాపపడ్డాను" అంది శశికళ.

"ఈ పశ్చాత్తాపమే మీ అందరి ప్రాణాలూతీస్తోంది. తర్వాత పశ్చాత్తాప పడవచ్చుగదా అని మీరు చాలా తప్పులు చేస్తూంటారు. కానీ నాకు పశ్చాత్తాపమంటే అసహ్యం. అందుకే తప్పుచేసేముందు బాగా ఆలోచిస్తాను. ఒకసారి ఒకపని చేయాలని నిర్ణయించుకున్నాక ఆడపిల్ల కన్నీళ్ళకు కరిగేవాణ్ని కాదు. అనుకొన్నది చేశాక పశ్చాత్తాప పడటమూ ఉండదు. కబుర్లుమాని బట్టలువిప్పు" అన్నాను కర్కశంగా.

శశికళ చాలా ప్రయత్నించింది. ఎన్నో కబుర్లు చెప్పింది. ఏమీ ఫలితం లేకపోగా ఆఖరికి భోరుమని ఏడ్చేసింది. ఇంక లాభంలేదని నేనే కార్యరంగంలోకి దిగాను.

ఆ సమయంలో నాలో స్త్రీవాంఛకన్నా ప్రతీకార

కాంతే ఎక్కువగావుంది. అయినా కొంత ఆనందం నాకు కలగకపోలేదు.

ఇప్పుడు శశికళ నిశ్శబ్దంగా ఏడుస్తోంది.

"ఏడ్వడం అనవసరం. ప్రేమించడమేకానీ ప్రేమించబడడానికి నోచుకోని దౌర్భాగ్యుణ్ని నేను. ఆ దౌర్భాగ్యుణ్ని ప్రేమిస్తున్నట్లు నటించి ఆశలురేపావు. నువ్వు ప్రేమిస్తున్నానని చెప్పినపుడు నాలో రేగినది కామం కాదు. అంతులేని ఆనందం. నన్ను ప్రేమించే మనిషి ఇన్నాళ్ళకు ఒకరున్నారని గ్రహించి పొంగిపోయాను. ఆ పొంగుమీద తీశావునువ్వు దెబ్బ. ఇంకమీద నాలాంటి దౌర్భాగ్యుల జీవితాలతో ఆటలాడకు. నీకు నేను చేయగల ఉపకారమల్లా ఒక్కటే. ఈ విషయం మూడో కంటివాడికి తెలియనివ్వను. వెళ్ళి మర్యాదగా బ్రతుకు" అన్నాను.

శశికళ కళ్ళుతుడుచుకొని "నువ్వు రాక్షసుడువి___" అంది.

"అవును రాక్షసుడినే. రాక్షసులు మనుషుల్ని మాత్రమే బాధించగలరు. కానీ నీలాంటి ఆడవాళ్ళు మనుషులకు నరకాన్ని చూపిస్తారు. నరకంలోని బాధలు ఆత్మకేకానీ శరీరానిక్కాదు. శరీరపు బాధలు సహించుకోవచ్చును గానీ, ఆత్మకు బాధకలిగితే తట్టుకోవడం కష్టం"

"ఒక చెల్లికి అన్నగానయినా మనిషిలా ప్రవర్తిస్తావనుకున్నాను .."

"నా బంగారుతల్లి మగవాళ్ళ జీవితాలతో ఆటలాడదది" అన్నాను.

శశికళకు మళ్ళీ ఏడుపు వచ్చినట్లుంది. కళ్ళు తుడుచుకున్నది.

"మరి నేను వెడతాను..." అన్నాను.

"నన్నిక్కడ వదిలేశా?"

"దమయంతి మరీ అంత తెలివి తక్కువదికాదు. నీకిక్కడే ప్రమాదమూ వాటిల్లదు. నువ్వు పెందరాళే ఇల్లు చేరకపోతే నీవాళ్ళు పోలీసు కంప్లయింటిచ్చే అవకాశముందికదా. దమయంతి వ్యవహారాన్నంతవరకు పోనివ్వదు. ఎటొచ్చి నీనుంచి అయిదొందలు బేరం ఎక్స్ పెక్టు చేస్తోంది నేను రెండొందలు యిచ్చాను. నిన్నింకో గంటో రెండు గంటలో ఉంచుకొని ఆడబ్బుకూడ రాబట్టుకొని పంపించేస్తుంది..." అంటూ అక్కణ్నించి కదలబోయాను.

శశికళ కళ్ళలో భయం స్పష్టంగా కనిపించింది—"వద్దు, నన్ను నీతోపాటే బయటకు తీసుకుపో. ఆమెకు కావలసిందిడబ్బే అయితే నా మెడలోని బంగారుగొలుసు యిచ్చేస్తాను..." అంది.

"సరే అయితే పద" అంటూ ఆమెనింకో పర్యాయం గట్టిగా కౌగలించుకొని గాలిలోకి ఎత్తాను. ఆమె అభ్యంతర పెట్టలేదు. "మనిద్దరకూ యిదే ఆఖరి కౌగిలి—" అన్నాను.

# 7

మూర్తి తర్వాత నాతో చాలాసార్లు మాట్లాడడానికి ప్రయత్నించాడు కానీ నేనతని ప్రయత్నాలు సాగనివ్వలేదు. అతన్ని నా శత్రువుగా ట్రీట్ చెయ్య సాగాను.

రమేష్ నాకు మరికొన్ని స్మగ్లింగ్ ఆఫర్స్ తెచ్చాడు. కానీ అవీ ఉపయోగించుకోలేదు నేను. వాడు నన్ను బెదిరించాడు కూడా. ఒకసారి అటువంటి పనిచేశాక మళ్ళీ చేయనంటే వాళ్ళకోపం వస్తుందనీ, ఏమయినా చేస్తారనీ!

"మిస్టర్ రమేష్ ఎవరికో కోపం వస్తుందని, ఎవరైనా ఏమైనా చేస్తారని భయపడే రకం కాదు నేను. నా అవసరానికి పనులు చేస్తాను. అలాంటి పనులంటే నాకాసక్తిలేదు. నేరాలు చేయడం నా అభిమతంకాదు. బెదిరింపులకు లొంగేఘటం కాదు నేను. అవసరమైనప్పుడు సహాయపడ్డావు. అందుకు చాలాచాలా థాంక్స్" అని చెప్పానతనికి.

కాని అప్పుడప్పుడు నన్ను గురించి నాకే భయంగా ఉంటోంది. నాదారి ఎటు వెడుతోంది.

ఎప్పటికయినా జైలుకు వెళ్ళే అవకాశం నా కుంటుందంటుందమ్మ. అది సవతితల్లిగా ఆమె కోరుకుంటున్నదా లేక నా ప్రవర్తనతో ఆమె భవిష్యత్తునూహిస్తోందా?

ఒకసారి కావాలని రాధని తోసేసాను. నాకూ, అమ్మకూ భేదాభిప్రాయాలు కలగజేస్తోందని పెంకాయమ్మ గారిని కొట్టినంత పనిచేశానొకసారి. ఒక స్మగ్లర్‌కు సాయంచేశాను డబ్బుకోసం. ప్రతీకారం తీర్చుకోవడం కోసం ఒక ఆడపిల్లకు మానభంగం చేశాను.

వీటిలో ఏపనికీ నేనిప్పుడు బాధపడటంలేదు. కానీ నేరాల్లో నాస్థాయి నానాటికీ పెరుగుతోంది. ఇలాగే ఒకనాటికి పెద్ద నేరంచేసి పోలీసులకు పట్టుబడి పోతానా?

బాగా ఆలోచించగా అలా జరగదనిపించింది నాకు. ఎందుకంటే పరిస్థితులకు నా ఆవేశం తోడుకాగా నేను నేరాలు చేస్తున్నాను తప్పితే నేను నేరాలకు బానిస కాదు.

రాధంటే నాకు కోపముంది. అయితే అది నన్ను రెచ్చగొట్టినపుడు మాత్రమే నేను దాన్ని కొడతాను.

నా ప్రాణానికి ప్రాణమైన ఉమకది అన్యాయం తలపెట్టి నవుడే దాన్ని నేను హింసిస్తాను. అలాగే ఒకే ఒకసారి స్మగ్లింగ్ నేరం చేశాను. డబ్బులు బాగా సంపాదించ వచ్చునని తెలిసీ నేను మళ్ళా దానిజోలికి వెళ్ళలేదు. ఆ వృత్తిపట్ల ఆసక్తి నాకు కలుగలేదు. శశికళకు మాన భంగం చేసినా వ్యభిచారిగా మాత్రం నేను మారలేదు.

సాధారణంగా నాలాంటి నేరాలుచేసినవారు పతనమై పోయే అవకాశముంది. నేనలా కావడంలేదు. అంటే నేనెప్పుడయినా నేరం చేయవచ్చునేమో గానీ నేరం చేయడాన్ని నా వృత్తిగా మాత్రం పెట్టుకోను.

నా చదువు పూర్తయిపోయింది. బియ్యే ఆర్డినరీగా పాసయ్యాను. వెంటవెంటనే ఉద్యోగాలు దొరకడం లేదు కాబట్టి టైపు, షార్టుహ్యాండు నేర్చుకోసాగాను. ఈ సలహా మా ఎదురింటాయన ఇచ్చాడు. గ్రాడ్యుయేట్ స్టెనోలకు చాలా పెద్దపెద్ద జీతాలు దొరుకుతాయట.

ఒకసంవత్సరంలో రెండింటిలోనూ చెప్పుకోదగ్గస్థాయికి వచ్చాను. ఉద్యోగాని కవసరమైన సర్టిఫికేట్లు సంపా దించాను. చెల్లెలు ఉమ చదువుకూడా అయిపోయింది. బీయస్సీ ఫస్టుక్లాసులో పాసయిందది. నాన్నకి దాని పెళ్ళి చేసెయ్యాలని ఉంది. దానికి మాత్రం యమ్మెస్సీ చద వాలనివుంది.

నాన్న సంబంధాలు చూడటం ప్రారంభించాడు. పెళ్ళివారు వస్తున్నారు, వెళుతున్నారు. ఉమ ఎమ్మెస్సీలో చేరింది.

ఒకసారి వచ్చిన పెళ్ళివారికి ఉమ నచ్చేసింది. అప్పటి కప్పుడే పెళ్ళిమాటలు తేల్చేశారు. నాన్నకు సంతో

పమూ, కంగారూకూడా కలిగాయి. అన్నీ తేల్చివారం రోజుల్లో ఉత్తరం రాస్తానన్నాడు. పెళ్ళివారు వెళ్ళి పోయాక ఉమకు కంగ్రాట్సు చెప్పబోయాను. దాని ఏడుపు ముఖం చూసేసరికి ఆశ్చర్యమయింది.

"అదేమిటే అలాగున్నావ్" అన్నాను.

"నాకీపెళ్ళి ఇష్టంలేదు" అంది ఉమ.

"దానికేముంది. నాన్నకు చెప్పేద్దాం, కానీ..."

"నాన్న ఒప్పుకోడు. అసలు యిప్పట్లో పెళ్ళి యిష్టం లేదు నాకు."

"ఎందువల్ల?"

"చదువు పూర్తిచేయాలి..." అంటూ నసిగింది ఉమ.

"బాగుంది చదువు పూర్తయ్యాకయినా పెళ్ళిచేయాలి గదా ఈపెళ్ళివారినే నీ చదువు కొప్పిద్దాం" అన్నాను.

"నాన్న వాళ్ళతో అదీ కదిపిచూశాడు. వాళ్ళొప్పుకునేలాగే వున్నారు..."

"మరి..."

"నాకీపెళ్ళి ఇష్టంలేదు."

"ఎందువల్ల"

"నేనొకతన్ని ప్రేమించాను" చాలా నెమ్మదిగా సందేహిస్తూ అంది ఉమ.

నాకు కలిగిన ఆశ్చర్యమింతా అంతా కాదు. ఎవరితోనూ నోరువిప్పి మాట్లాడని ఉమ, అమాయికురాలిలా కనిపించే ఉమ, ఎవరినో ప్రేమించడమా?

కాసేపటి వరకు నేనేమీ మాట్లాడలేక పోయాను.

"అన్నయ్యా—నువ్వేనన్ను రక్షించాలి. అప్పుడే పెళ్ళి చేసుకోవడం మా యిద్దరికీ ఇష్టంలేదు. అంతవరకూ ఇంట్లో పెళ్ళి ప్రయత్నాలు జరగకుండా ఎలాగో నువ్వే ఆపాలి..."

ఎవరికైతే చీమకుట్టినా సహించలేనో, ఎవరికోసమైతే నేను ప్రాణాలగురించికూడా లెక్కచేయనో, నాబ్రతుకు కొక బాధ్యతగా ఇంతకాలమూ ఎవరినైతే భావిస్తూ జీవిస్తూన్నానో__ఆ నా చిన్నారి చెల్లెలు ఉమ యింత వరకూ జీవితంలో ఒక్కసారికూడా నన్నేదీ కోరలేదు. ఈరోజు నోరువిడచి ఒకకోరిక కోరింది. కాదని యెలా అనగలను?

"ఎవరతను?"

"నీకు తెలిసినతనే__మూర్తి!" అంది ఉమ.

నా చెవులను నేనే నమ్మలేకపోయాను. నాకాళ్ళ క్రింద భూమి కదిలిపోతున్నట్లనిపించింది.

'పట్టుదలతో నేనేదైనా సాధించగలనోయ్ రవీ' అన్న మూర్తిమాటలు నా చెవుల్లో గింగురుమంటున్నాయి.

"ఉమా నువ్వు మూర్తిని ప్రేమించావా? మూర్తి నా గురించి నీతో ఏమీ చెప్పలేదా?" అన్నాను.

"నువ్వు చాలా మంచివాడివనీ, నీది చాలా మంచి హృదయమనీ చాలాసార్లు నాతో అన్నాడు..." అంది ఉమ.

నా కళ్ళు తిరిగాయి. ఇద్దరికీ పరిచయం బాగా పెరిగిందన్న మాట. తరచుగా కలుసుకుని మాట్లాడుకునే వారు కూడానన్న మాట. నేనెంతో అమాయకురాలన్న ఉమ ఎంత కథ నడిపింది? కానీ యిందులో మూర్తి మోసముందని నాకు తోస్తోంది. నా గురించి శశికళ అతగాడికేదైనా చెప్పివుండవచ్చు. అతగాడు ప్రతీకారం తీర్చుకోవడం కోసమే నా చెల్లెలిని ప్రేమిస్తున్నాడేమో!

"నీకు తెలియదు ఉమా మూర్తిగురించి నాకు బాగా

తెలుసు. పరమదుర్మార్గుడు వాడు. నన్ను నీ దగ్గర పొగిడాడంటే అది కేవలం నీ మెప్పు పొందడంకోసమే— వాడి చరిత్రంతా నాకు తెలుసు..." నేనింకా ఏదో చెప్పబోతుండగా "అతని గురించి నువ్వింకేమీ చెప్పవద్దన్నయ్యా మేమిద్దరం ఒకరినొకరం బాగా అర్థం చేసుకున్నాం. తిరుగులేని నిర్ణయం మాది. ఎటొచ్చీ తాత్కాలికంగా వచ్చిన ఈ బెడదను ఆపాలి నువ్వు—" అంది ఉమ.

తెల్లబోయి ఉమవంక చూశాను. దాని కళ్ళలో దృఢ నిశ్చయం కనబడుతోంది.

మూర్తిని పెళ్ళిచేసుకుంటే ఉమ సుఖపడదని నాకు తెలుసును. మూర్తి కేవలం నా మీద కక్ష సాధించడం కోసమే ఉమను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు. ఉమకూ నాకూ వున్న అనుబంధం అతనికి తెలుసును. ఉమ జీవితం నరకప్రాయం చేసి నన్నేడిపించాలనుకుంటున్నాడు. వాడి ఆటలు సాగనివ్వను!

## 8

మర్నాడు మూర్తిని కలుసుకున్నాను. అతనూళ్ళో ఇటీవలే ఒక బట్టల దుకాణం ప్రారంభించాడు. ఏదో బ్యాంకు లోను సంపాదించినట్లున్నాడు. నేనతన్ని కలుసుకోడానికి తిన్నగా బట్టలదుకాణానికే వెళ్ళాను. సుమారు మూడు సంవత్సరాల తర్వాత అతన్ని మళ్ళీ పలకరించి విష్ చేశాను. నేను పలకరించగానే మూర్తి ముఖంలో ఆనందం కనబడింది "కులాసానా" అన్నాడు.

"నీతో మాట్లాడాలి ఏకాంతంగా" అన్నాను.

మూర్తి కౌంటర్ ఇంకొకతనికి అప్పగించి అక్కణ్ణించి

కదిలాడు. ఇద్దరం గుడానికి దగ్గర్లోవున్న పార్కులోకి వెళ్ళాం.

"మళ్ళీ మనం కలుసుకుని మాట్లాడుకోగలుగుతున్నాం గుక నాకు చాలా సంతోషంగా వుంది—" అన్నాడు మూర్తి.

"ఆ సంతోషం కలకాలం ఉండాలంటే నాకో మాటివ్వాలి నువ్వు."

"ఏమిటది?"

"ఉమను మర్చిపోవాలి..."

మూర్తి నవ్వాడు "ఇంతకాలం నీకు తెలియదా?"

"తెలిస్తే ఇంతవరకూ రానిచ్చేవాడిని కాదు..."

"రానివ్వడానికీ రాకపోనివ్వడానికీ నువ్వెవరు?"

"ఉమ అన్నని."

"ఐసీ—ఉమ ఎల్లకాలం అన్నతో జీవించదు కదా_ తనతో జీవితం పంచుకోడానికి ఆమెకో భర్త కావాలి. ఆమె ఎన్నుకున్న భర్తని నేను—నన్ను నువ్వాపలేవు."

"మూర్తీ నామీద పగతో నా చెల్లెల్ని మభ్యపెట్టి మోసంచేసి ప్రేమలో దింపావు. ఇప్పుడు పెళ్ళి అంటూ న్నావు. చూస్తూ చూస్తూ ఒక ఆడపిల్ల బ్రతుకన్యాయం చేయడానికి నీకు మనసెలా ఒప్పింది?" ఈ ప్రశ్న వేసి నపుడు నా మనసులో శశికళ లీలగా గుర్తుకు రాక పోలేదు. అయితే శశికళనూ ఉమనూ పోల్చుకోవడం నాకిష్టముండదు.

మూర్తి అదోలా నా వంక చూసి "నీమన సత్యం నాకర్థం కావడంలేదోయ్ ఏ ఊహాలోకాల్లో జీవిస్తున్నావోయ్ నువ్వు? నాకింకేమీ పని లేదనుకున్నావా? నీ మీద నాకు

పగెందుకు? నీ చెల్లెల్ని నేను ప్రేమించాను. పెళ్ళి చేసుకుంటాను. ఆమె బ్రతుక్కి న్యాయం చేయడంవల్ల నా జీవితం మాత్రం నరకప్రాయం కాదా? జీవితమంటే చిన్నపిల్లల ఆట అనుకుంటున్నావా? ఉమను నేను పువ్వుల్లో పెట్టి పూజించుకుంటాను. ఆమె నా జీవితాన్ని స్వర్గం చేయగలదని నాకు నమ్మకముంది. ఇందులో పగల ప్రసక్తి లేనేలేదు'' అన్నాను.

అతని మాటలు వింటూంటే ఏదోలా అనిపించింది. అతని గురించి నా ఆలోచనలు తప్పేమో అనిపించింది.

అయితే అలాంటప్పుడే నాకు నా సవతితల్లి గుర్తొస్తుంది. ఆమెకు నేను చేసిన అన్యాయమేమీ లేదు. చిన్నతనంనుంచీ ఆమె నామీద కోపాన్ని పెంచుకుంది. పగబట్టింది. నామీద పగ తీర్చుకోవడమే తన జీవిత ధ్యేయమన్నట్లు మసలుకుంది. అప్పుడప్పుడు నాన్నగారు నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తారు. వినదు. నానా అల్లరీ చేస్తుంది. ఒకోసారి నాన్నగారు విసుక్కుంటూండేవారు కూడా. మా అమ్మకి నా మీద ఉన్న పగకారణంగా మా ఇల్లు నరకప్రాయమైంది. అమ్మకీ సంగతి తెలుసు. తను నన్ను ప్రేమించనవసరం లేదు. ద్వేషించకుండా వుండగలిగితే చాలు. ఇల్లు స్వర్గంలా వుంటుందనీ, అలా వుండడంవల్ల తనకూ సుఖమేననీ కూడా తెలుసు.

అయినా అమ్మ నన్ను ద్వేషించడం మానదు. నన్ను సాధించడంకోసమే తను పుట్టినట్లు మసలుతుంది. అందుకే నాకు ప్రేమమీద అంత నమ్మకంలేదు కానీ పగమీద మాత్రం విపరీతమైన అనుమానం. పగ వున్నమనిషి జీవితం నరకప్రాయమైనా లెక్క చేయకుండా పగను తీర్చుకు

నేందుకు ప్రయత్నిస్తాడని నా నమ్మకం. ఆ నమ్మకమే మూర్తిని నమ్మవద్దని చెబుతోంది.

"మూర్తీ నేను నీ కబుర్లు వినడానికి రాలేదు. నిను కట్టుకుని ఉమ సుఖపడదని నాకు తెలుసు. అది అమాయకు రాలు. దానికేమీ తెలియదు. ఎలాగో దాన్ని మోసం చేశావ్. కానీ యిక నువ్వు ఆగాలి. ఆగకపోతే నిన్నేం చేస్తానో నాకే తెలియదు..."

"ఏం చేస్తావ్?"

"బహుశా చంపేస్తానేమో" అన్నాను.

మూర్తి నా వంక ఆశ్చర్యంగా చూశాడు. నా కళ్ళలో నా నిర్ణయపుబలం అతనికి కనబడివుండాలి. అందుకే "ఆలోచించుకునేందుకు వ్యవధి కావాలి..." అన్నాడు.

"ఎంత?"

"ఎల్లుండి సాయంత్రం నాలుగు గంటలకి నువ్వు నన్ను నా ఇంట్లో కలుసుకో" అన్నాడు మూర్తి.

"ఓకే_అలాగే_కానీ నేను నీకిస్తున్న వ్యవధి ఏం చేయాలో ఆలోచించుకోవడానికి కాదు. నా చెల్లెలి జోలికి రాకూడదని నీ మనసుకు నువ్వు నచ్చచెప్పుకోవ డానికి" అన్నాను.

అక్కణ్ణించి తిన్నగా ఇంటికివెళ్ళాను. నాన్నగారు పురోహితుడితో మాట్లాడుతున్నారు. అమ్మకూడా అక్కడే వుంది. నన్ను చూసి "చదువుకునే రోజుల్లోనే నయం_ఇంటికి రావడానికీ, బయటకు వెళ్ళడానికీ ఓ వేళా పాళా ఉండేది" అంది. నేను నిర్లక్ష్యంగా లోపలకు వెళ్ళాను. ఉమకు పెళ్ళి ఏర్పాట్లు జోరుగానే జరగ బోతున్నవన్న మాట. ఈ ఏర్పాట్లు నేనాపదల్చుకోలేదు.

ఎందుకంటే ఉమకు వచ్చిన సంబంధం మంచిదే. ముఖ్యంగా మూర్తితో పోల్చుకుంటే ఆ సంబంధం మరీ ఉన్నతమైనదిగా కనబడుతోంది. ఉమను మూర్తి బారి నుండి రక్షించడానికి ఇంతకుమించి ఉపాయం కనబడ లేదు నాకు.

కానీ ఆ రాత్రి ఉమ నా దగ్గరకు వచ్చి గోల పెట్టింది పెళ్ళిగురించి. నేను దాన్ని మందలించాను. పెద్దలకు తెలిసిన బాగోగులు పిల్లలకు తెలియవు. పై విషయంలో స్వయంనిర్ణయాలు మంచివి కాదని చెప్పాను.

ఉమ నన్ను తన దారికి మళ్ళించడానికి చాలా ప్రయత్నాలు చేసి ఆఖరు బాణంగా "నాకెవ్వరూ లేక పోయినా అన్నయ్యైనా ఉన్నాడనుకున్నాను. ఈ రోజు నించీ ఆ ఆశకూడా నిరాశే అయింది" అంది.

నేను చలించలేదు. నా బాణం నేనూ వేశాను "నా బ్రతుకే నా ఏకైక చెల్లెలికోసం. చూస్తూ చూస్తూ దాని బ్రతుకు నాశనం కానిస్తానా?"

ఉమ మాట్లాడకుండా వెళ్ళిపోయింది. మూర్తిని కలుసుకోడానికి వెళ్ళేవరకూ ఉమను తప్పించుకునే తిరిగాను. ఆ రోజు రానేవచ్చింది.

మూర్తి ఇంటికి వెళ్ళి "ఏమిటి నీ నిర్ణయం నా నిర్ణయమేనా?" అన్నాను.

మూర్తి నవ్వి—"ఏమిటి నీ నిర్ణయం?" అన్నాడు.

"నువ్వు ఉమ జోలికి రాకపోవడం..."

"సారీ ఉమ లేకుండా నేను బ్రతకలేను."

"అయితే నువ్వూ బ్రతకవు..."

"ఏం!"

జేబులోంచి చాకు తీశాను "ఈ పూట ఈ చాకు నీ ప్రాణాలు తీస్తుంది?"

"ఎందుకు?"

"ఉమను మరిచిపోనందుకు!"

"నా భార్యను మరిచిపోమనడం నీకు న్యాయమా?" అన్నాడు మూర్తి.

"ఉమను నీకు భార్యను కానివ్వను నా కంఠంలో ప్రాణముండగా—"

"నీ కంఠంలో ప్రాణం సంగతి నాకు తెలియదు కానీ ఉమ ఇప్పుడు నా భార్య."

"అదెలా సాధ్యం?"

"తెలుసుకుందువుగాని..." అంటూ "ఉమా!" అని కేక పెట్టాడు మూర్తి. లోపల్నుంచి ఉమ వచ్చింది. నా చేతిలోని చాకు జారిపడింది.

"ఇంక లాభంలేదని ఈ రోజుదయం రిజిస్ట్రాఫీసులో పెళ్ళి చేసుకున్నామన్నయ్యా" అంది.

నా కళ్ళు మసకలు కమ్మాయి. గిరుక్కున వెనక్కి తిరిగాను.

"ఏమోయ్ నీ చాకు" అన్నాడు మూర్తి. అది వేళాకోళ మైవుంటుంది.

"నా గుర్తుగా అట్టేపెట్టుకో" అన్నాను.

# 9

అమ్మ ఉమను నానామాటలు అంది. తన పిల్లల గతేం కావాలంది. నలుగురిలో తలెత్తుకు తిరగలేకుండా చేసిందది. నాన్నమాత్రం అన్నీ భరించాడు. ఆయన మనసులో ఏముందో తెలియదు. నా గుండెలో అగ్ని

పర్వతాలు బ్రద్దలవుతున్నాయి. జీవితంమీద విరక్తి కలుగుతోంది.

మా అమ్మపోయి సవతితల్లి వచ్చినప్పట్నించీ ఉమ మీద నాకు ప్రత్యేకాభిమానం ఏర్పడింది. తనమీద ఈగ వాలకుండా చూసేవాణ్ణి. సవతితల్లితో చాలాసార్లు ఉమ గురించే గొడవయ్యేది. కందకు లేని దురద కత్తిపీట కెందుకని దెబ్బలాడేది అమ్మ. నా బాధ తను అర్థం చేసుకో లేదు!

ఉమ నన్నర్థం చేసుకుంటుందని ఆశించాను కానీ నా మాటలు కాదని నేను శత్రువుగా భావిస్తున్న వాణ్ణి వివాహం చేసుకుంది. ఏదో ఒకరోజున తనందుకు పశ్చాత్తాప పడకతప్పదు.

పశ్చాత్తాపం సంగతి గుర్తుకు రాగానే ఉమ నా చెల్లెలని గుర్తుకొచ్చింది. తను చేసిన పనికి నాకులాగే అది కూడా పశ్చాత్తాపం పడదేమో? అప్పుడే నాకు శశికళ గుర్తుకొచ్చింది. ఉమకు శశికళకు పట్టిన గతి పట్టకూడదని మనసులోనే దేవుణ్ణి ప్రార్థించుకున్నాను. కానీ దేవుడిమీద నాకంత నమ్మకంలేదు.

ఎలాగైనా మూర్తి తెలివైనవాడు. అనుకున్నది సాధించగలడు.

ఉమ పెళ్ళయ్యాక రెండు నెలలకు నాకు హైదరాబాదులో ఉద్యోగం వచ్చింది. వెళ్ళిపోయాను. ఇప్పుడు నాకు జీవితంపట్ల పెద్ద ఆసక్తిలేదు. నాన్న నా గురించి పట్టించుకోడు. అమ్మకు నేనంటే ద్వేషం. నన్ను ప్రేమించే చెల్లెలు నా శత్రువుకు భార్య.

ఇలాంటి సందర్భంలో నాకు ఉషతో పరిచయమైంది.

ఉషతో పరిచయం కాకపోతే నా జీవితంలో విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకునేవాడినేమో!

ఉష ప్రాయంలోవున్న అందమైన కన్నెపడుచు. మెట్రిక్ ప్యాసైంది, టైపు, షార్టుహేండూ నేర్చుకుని ఏదో కంపెనీలో స్టెనోగా పని చేస్తోంది. వయసు ఇరవైకి లోపే అనుకుంటాను. చూడ్డానికి పదహారేళ్ళ పిల్లలా ఉంటుంది. తియ్యగా మాట్లాడుతుంది.

బస్సుస్టాపు దగ్గరయ్యింది మా పరిచయం. అదలావృద్ధి చెందింది.

ఉష తలిదండ్రులు ముసలివాళ్ళు. వాళ్ళకామె ఒక్కతే సంతానం. తండ్రి అనారోగ్యకారణంగా వాళ్ళు అప్పులపాలయ్యారు. స్వంతిల్లుంది. కానీ వారికిప్పుడు ఉష సంపాదనే ఆధారం. అప్పులు తీరేవరకూ పెళ్ళి చేసుకో కూడదని ఉష అనుకుంటోంది. తలిదండ్రులలా అనుకోక పోయినా వారసహాయులు.

నేను నా కథను వివరించి చెప్పాను ఉషకు. నా కథంతా విని ఉష బాధగా నిట్టూర్చింది.

"నీకు ప్రేమాభిమానాలతో నిండిన ఓదార్పు కావాలి" అందామె.

"అవును. కానీ ఎక్కడ దొరుకుతుంది?" అన్నాను.

ఉష సమాధానమివ్వకుండా నవ్వింది.

రోజూ బస్‌స్టాప్ దగ్గర కలుసుకునే వాళ్ళం. మళ్ళీ దిగేప్పుడు కూడా అక్కడే. ఒకవేళ ఎవరైనా వెనకా, ముందూ అయినా రెండోవాళ్ళ కోసం ఎదురుచూసే వాళ్ళం.

"ఉషా — నువ్వింకా పెళ్ళి చేసుకోవేం?" అన్నా నొకరోజు.

"అప్పులు తీరాలి..." అంది ఉష.

"ఏమాత్రమున్నా యేమిటి?"

ఉష వివరాలు చెప్పింది.

నాన్నకి పెద్ద డబ్బవసరం లేదు. నేను ఇంటికి డబ్బు పంపేవాణ్ణికాదు. ఉషకు వాయిదాలలో నెలకు పాతికో యాభయ్యో, డెబ్భైఅయిదో వీలునుబట్టి సాయం చేస్తూండే వాడిని. అలా చేస్తే రెండు మూడేళ్ళలో అప్పులు పూర్తిగా తీరిపోయే అవకాశముంది.

నాకు తెలియకుండానే నేను ఉషపట్ల ఆకర్షితుడి నౌతున్నాను. ఆమెకూ నేనంటే ఇష్టమేనని నాకు అని పిస్తోంది. నేనెక్కడికి రమ్మంటే అక్కడకు వస్తుంది. తీయటి కబుర్లు చెబుతుంది. లాలనగా చూస్తుంది. నాకు మళ్ళీ జీవితంమీద మోజు పుడుతోంది.

మా పరిచయానికి ఏడాది వయసు వచ్చేక ఒకరోజు తెగించి "ఉషా! నాకవసరమైన ఓదార్పు నీ దగ్గర లభి స్తుందనిపిస్తోంది" అన్నాను.

"అబద్ధం నువ్వు అనుకోవడంలేదు" అంది ఉష.

నేను దెబ్బతిని "ఎందుకలా అన్నావ్?" అన్నాను.

"నిజంగా నువ్వు నా ఓదార్పులో శాంతి లభిస్తుందను కుంటే ఈ ఏడాది పరిచయంలో ఒక్కసారైనా నీ గదికి రమ్మని ఆహ్వానించేవా?" అంది ఉష.

ఆశ్చర్యపోయి ఉషవంక పరీక్షగా చూశాను. ఒక ఆడపిల్ల అనవలసిన మాటలేనా అవి?

"నువ్వాడపిల్లవి కాకపోతే నా గదికి ఎప్పుడో పిల్చి ఉండేవాణ్ణి."

ఉష నవ్వి "మగాడికి మగాడి ఓదార్పే సరిపోతే

పెళ్ళి ఆడదాన్నెందుకు చేసుకుంటాడు?'' అంది.

నిజమే. ఆఫీసులో నాకు కొలీగ్సున్నారు. చాలా మంది నాతో సరదాగా మాట్లాడతారు. అయినా ఉష పరిచయమూ, సమక్షమూ నాకిచ్చే ఆనందం మరెవ్వరి వద్దా లభించడంలేదు.

"అయితే యిప్పుడే ఆహ్వానిస్తున్నాను. నా గదికి వస్తావా?'' అన్నాను. ఏమిటో నా ఆహ్వానం నాకే ఎబ్బెట్టుగా ధ్వనించింది.

"నువ్వొక్కడికి రమ్మంటే మాత్రం కాదన్నాను?'' అంది ఉష.

ఇద్దరం లేచాము. ద్రాక్ష, యాపిల్సుకొన్నాను దారిలో. ఇద్దరం ఇల్లుచేరాం.

"బాగుంది నీ గది'' అంది ఉష.

"థాంక్స్'' అన్నాను.

"వేరే బాత్రూముందా?'' అంది.

వేలుపెట్టి చూపించాను.

"బాగుంది నేను స్నానం చేస్తే అభ్యంతరమా? నీళ్ళ కిబ్బంది ఉండదు కదా'' అంది ఉష.

ఏమనాలో తెలియలేదు. ఒక క్షణం ఆగి— "ఇప్పుడెందుకు స్నానం?'' అన్నాను.

ఉష చాలా గమ్మత్తుగా నవ్వింది. "స్నానం చేసినవంటికీ, చేయనివంటికీ చాలా తేడా వుంటుంది—''అని "ఇస్త్రీ చేసిన లుంగీ, చొక్కా వున్నాయా నీ దగ్గర'' అంది.

నాకంతా అయోమయంగా వుంది. ఉష ఒకొక్కటే నన్నడిగి తెలుసుకుని బాత్రూంకి వెళ్ళి స్నానం చేసి నా

లుంగీ-చొక్కా కట్టుకునివచ్చింది. ఆమెనలా చూస్తూంటే నా మనసు ఏదోలాగై పోయింది.

"అలా చూడకు. నువ్వు వెళ్ళి స్నానం చేసిరా" అంది ఉష.

మంత్రముగ్ధుడిలా ఆమె ఆజ్ఞ పాలించాను.

అంతకాలం నాకు దూరంగా వుండే ఉష ఆరోజు నా స్వంతమయింది.

"నువ్వు దేవతవి ఉషా నీ సమక్షంలో స్వర్గసుఖాలు చవిచూస్తున్నాను" అన్నాను.

ఉష నవ్వి "నాకేమనిపిస్తోందో తెలుసా మనమిద్దరమూ ఒకరికొరకు ఒకరు పుట్టామని" అంది.

శశికళ తర్వాత స్త్రీతో అనుభవం ఇదే నాకు. అప్పుడు నాకంత ఉత్సాహంగా అనిపించలేదు కానీ అనుభవంలో శరీరం దూదిపింజలా తేలిపోయింది. మనసు నిండా ఏదో సంతృప్తి ఆవరించుకుంది.

"ఉషా హఠాత్తుగా నాకు వరమివ్వాలని ఎందుకనిపించింది నీకు?"

"వరమివ్వడమేమిటి? నీ హక్కు నువ్వు సాధించుకున్నావు!"

"అదెలా?" అన్నాను గానీ ఉషకు నేనార్థికంగా సాయం చేస్తున్నానని గుర్తుకువచ్చింది.

"చెప్పానుగా మనమిద్దరమూ ఒకరికొరకు ఒకరు పుట్టామని" అంది ఉష.

"ఉషా ఇంక నేనాగలేను. మనిద్దరం పెళ్ళి చేసేసుకుందాం" అన్నాను.

"పెళ్ళి గురించి కంగారు పడవద్దు. నీ కంగారు అణ

చడం కోసమే ఈ రోజు నీ స్వంతమయ్యాను..." అంది ఉష.

"నీ మాటలు నాకర్థం కావడంలేదు."

"అర్థం కావడానికేముంది? ఈ వయస్సులో ఆడా, మగా పెళ్ళికి ఎందుకు తొందరపడతారు? నీ వాటం చూస్తూంటే పెళ్ళి కబుర్లు కదుపుతావనిపించింది. నువ్వు నాకన్యాయం చెయ్యవన్న నమ్మకం నాకుంది. నీమీద నాకు గౌరవముంది. నా నమ్మకాన్నీ, గౌరవాన్నీ ఈ విధంగా చూపించుకున్నాను. దయవుంచి నేను చెప్పే వరకూ నావద్ద పెళ్ళికబుర్లు తీసుకురావద్దు" అంది ఉష.

ఉష స్వభావం నా కర్థంకాలేదు. జరిగిన దాంట్లో అన్యాయమంటూ ఉంటే ఆమెకే కానీ నాకు లేదు. కానీ ఆమెకన్యాయం చేయడం నా కిష్టంలేదు. ఖాళీ అయిపోయిన నా హృదయంలో క్రమక్రమంగా ఆమె మూర్తి రూపురేఖలు దిద్దుకుంటోంది.

ఉషను నేను మనసారా ప్రేమిస్తున్నాను.

హైదరాబాదు నించి రెండుమూడు పర్యాయాలు ఇంటికి వెళ్ళివచ్చాను. నాన్న పెళ్ళిగురించి మాట్లాడేదు. నా విముఖత చూపించేను. అమ్మ డబ్బు గురించి ఏం చేస్తున్నావని అడిగింది. నేను సమాధానం చెప్పలేదు. ఉమ సంసారం హాయిగా సాగిపోతున్నట్లు తెలిసింది. కానీ నేను వెళ్ళి చూడలేదు. ఉమ ఒకటిరెండు పర్యాయాలు ప్రయత్నించినా నేను తప్పించుకున్నాను. ఉమ యిప్పుడు ఇంటికి వస్తూపోతూ వుంటోందట. అటూఇటూ సామరస్యం కుదిరినట్లేవుంది.

ఉమమీద నాకు ప్రత్యేకమైన కక్ష ఏమీలేదు. దాని

జీవితమే మైపోతుందోనని బెంగతప్ప. ఇంటికీ ఉమకూ సామరస్యం కుదరడం ఒక విధంగా నాకూ సంతోషంగానే వుంది. నాకూ ఉషకూ పెళ్ళయినా ఇంట్లో పెద్ద రాద్దాంతం జరుగవచ్చు. అయితే కొంతకాలానికి సామరస్యం కుదరవచ్చునని ఉమ విషయం చూడగానే అనిపించింది.

ఎప్పుడు ఇంటికి వెళ్ళినా ఎవరిమీదా నా దృష్టి నిలిచేది కాదు. మళ్ళీ తిరిగి ఎప్పుడు వెళ్ళి ఉష ఒడిలో వాలిపోతానా అనిపించేది.

ఉషకు వలచివలపించుకోవడం బాగా తెలుసు. ఆమె నాకు ఎప్పుడు లభిస్తుందో, ఎప్పుడు లభించదో నాకు తెలియదు. ఆమె ప్రవర్తననుబట్టి నేనేమీ ఊహించలేను. నా ఊహలన్నీ ఆమె విషయంలో తప్పయిపోయేవి. ఒకోసారి ఆమె నన్నెంతగానో ఊరించి ఊరించి వదిలేసేది. ఒకోసారి అతి సామాన్యంగా నాకు లొంగిపోయేది. ఆమెముందు నేనొక పసిపాపను. నన్నెలా లాలించాలో, బుజ్జగించాలో ఆమెకు తెలుసు.

జీవితమంటే ఆసక్తి, జీవించాలన్న కోరిక నాలో చోటు చేసుకుంటున్నాయి. ఇవి ఉషచుట్టూ పేరుకుంటున్నాయి. ఎన్నోసార్లు ఉషకి చెప్పాను. "నువ్వు లేకపోతే నేను బ్రతకలేను ఉషా" అని.

ఆమెతో పెళ్ళికోసం నా మనసు తహతహలాడుతోంది. కానీ ఆమె ఆగమంది. తప్పదు ఆగాలి. ఒకటి కాదు, రెండు కాదు ఆమెకోసం అలా మూడు సంవత్సరాలు ఆగాను.

ఒకరోజు ఉష నా చేతికి ఒక కవరు ఇచ్చింది—
"లోపల ఏముందో చూడు."

చూశాను వందరూపాయల నోట్లున్నాయి. చాలానే వున్నాయి "ఏమిటిది?"

"నీకు నేను బాకీవున్నాను. అది తీర్చవద్దూ?"

"ఛా - ఉషా - నేను నీకు అప్పుగా ఇచ్చాననుకున్నావా?" అన్నాను.

"ఏమో-ఎందుకిచ్చావో-నువ్విచ్చిన డబ్బుకి శరీరంతో బాకీ తీర్చానన్న తలంపు నీలో వుండకూడదు. అందుకే నీ డబ్బు తిరిగి ఇచ్చేస్తున్నాను..." అంది ఉష.

"కానీ నువ్వు నా భార్యవైతే ఈ మాట అనగలిగి వుండేదానివికాదు" అన్నాను.

"అవును-నిజమే."

"వద్దుఉషా-ఈ డబ్బు నేను వెనక్కు తీసుకోను" అంటూన్న నేను ఉష కళ్ళలో నీళ్ళను చూసి ఆశ్చర్యపడ్డాను.

"నా బాధ నీకర్థంకాలేదు. సరేలే ఈ ఉషను కులటగా కాక మంచి స్నేహితురాలిగా గుర్తుంచుకో మళ్ళీ మనం కలుసుకోమనుకుంటాను."

ఉలిక్కిపడ్డాను "ఏమన్నావ్?"

"నా పెళ్ళి నిశ్చయమైంది రవీ" అంది ఉష.

ఆమె యేం మాట్లాడుతోందో అర్థంకావటానికి కాసేపు పట్టింది నాకు. ఉషకో పల్లెటూరిబావ వున్నాడట. బాగా ఆస్తిపరుడట. అతనికి ఉషమీద మోజు. ఉషకిష్టంలేదు అందుకే అతని ఆర్థికసహాయాన్ని తిరస్కరించి ఇక్కడ ఒంటరిగా ఉండి తలిదండ్రులను పోషిస్తోంది. అయితే ఇటీవల ఆమె బావ ఎలాగో ఆమె తలిదండ్రులను వశపర్చుకున్నాడట. ఆమె బావను పెళ్ళాడక

పోతే ప్రాణాలు తీసుకుంటామని బెదిరిస్తున్నారు తలిదండ్రులు. కొద్దినెలలుగా మాథనపడి చివరికి తలిదండ్రుల మాట వినడానికి నిశ్చయించుకుంది ఉష.

"అన్యాయం, నేనేమైపోవాలి?" అన్నాను.

"ఇంకో అమ్మాయిని చూసి పెళ్ళిచేసుకో—" అంది ఉష.

"ఎంత సింపుల్‌గా చెప్పావు ఉషా. నా ప్రేమనింతేనా నువ్వర్థం చేసుకున్నది."

"తలిదండ్రులపట్ల నాకున్న ప్రేమను నువ్వర్థంచేసుకోలేక పోతున్నావు."

"ఏమో. నువ్వు నా కన్యాయం చేస్తే నేనేమైపోతానో నాకు తెలియదు..."

"నీకు జరిగిన అన్యాయం ఏమిటి? నాకు సాయంచేసిన డబ్బు తిరిగిచ్చేశాను. నా సర్వస్వం నీకర్పించాను."

"నేను కోరిందది కాదు. నిన్ను నా జీవిత భాగస్వామిగా చేసుకోవాలని."

ఉష వినలేదు. వెళ్ళిపోయింది. ఆతర్వాత రెండు మూడుసార్లు ప్రయత్నించాను. ఒక స్నేహితుడ్ని పలకరించినట్లు పలకరించి ఊరుకుంది. లాభంలేదు. ఆమె నా చేయిదాటి పోతుందనిపించింది. నాలోని ఆవేశం కట్టలు తెంచుకుంది. ఒక విధంగా ఉష నన్ను మోసంచేసింది. నా జీవితంతో చెలగాట మాడింది. అందుకేదయినా ప్రతిక్రియ చేయాలి.

ఆమెకు కాబోయే భర్తను చంపేస్తే...

అందువల్ల నేను జైలు పాలవుతాను తప్పితే, ఉష జీవితానికేం నష్టంలేదు. ప్రేమనామె సులభంగా మరచి

పోగలదు. అయితే ఏం చేయాలి?

ఉష నాకుతప్ప మరెవ్వరికీ దక్కకూడదు. అందుకు ఏం చేయాలి?

ఆమె ప్రవర్తన సరయినది కాదని కాబోయే భర్తకు చెబుతానన్నాను. అందుకు ఉష భయపడదని నాకు తెలి శాక ఇంకొక్క మార్గం కనపడింది.

# 10

నేను గమనిస్తూనే ఉన్నాను. చేతిలో వ్యానిటీ బ్యాగు ఊపుకుంటూ ఉష ఆ షాపులో అడుగు పెట్టింది.

షాపులోజనం బాగానే వున్నారు. వారిలో కొందరిని ఉష ఆకర్షించింది. ఉష గోళ్ళరంగు, కాటుక కొని ఇంకేదో బేరమాడుతోంది.

"హాలో" అంటూ వెనుకనుంచి భుజంతట్టి పలకరించాను.

ఉష కంగారుగా ముందుకు తిరిగి నన్నుచూసి— "నువ్వా?" అంది.

"నీతో చిన్నవిషయం మాట్లాడాలి. ఒకసారి బయటకు వస్తావా?" అన్నాను.

అయిష్టంగానే నాతోకదిలి బయటకు వచ్చింది ఉష. షాపు ఎంట్రెన్సువద్ద నిలబడ్డాం ఇద్దరం. ఇటు రోడ్డు మీదా, అటు షాపులోనూకూడా కొంతమంది మాకేసి చూస్తున్నారు.

"నన్ను పెళ్ళిచేసుకుంటావా, లేదా?" అన్నాను.

"ఎన్నిసార్లు చెప్పాలి?" అంది విసుగ్గా ఉష.

"ఇదే నీ ఆఖరి మాటా?"

"అవు ఇదే నా ఆఖరిమాట..." అంటూ చిరాగ్గా వెను దిరిగింది ఉష.

"అయితే నిజంగానే ఇది నీ ఆఖరిమాట" అంటూ నా చేతిసంచిలోని ఇనుపగూటంతీసి బలంగా ఆమె నెత్తి మీద మోదాను. కెవ్వుమని కేక వేసింది ఉష. అంతలోనే మరింత బలంగా రెండోసారి మోదాను.

కుప్పలా నేలకూలింది ఉష.

ఒకసారి చుట్టూ చూసాను. చూసిన కొద్దిమందీ దిగ్భ్రాంతులై అలా నిలబడి ఉండిపోయారు. నేను తేరుకున్నాను. హఠాత్తుగా ఎందుకో నన్ను భయమావహించింది. చటుక్కున రోడ్డుమీదకు గెంతి కనపడిన ఆటోలో ఎక్కాను. తోచిన గమ్యం చెప్పాను ఆటో అతనికి. ఆటో కొంతదూరం వెళ్ళాక చేతిలోని గూటాన్ని ఒక మురుగు కాలవలోకి విసిరేశాను.

నెమ్మదిగా నా మనసు తేలిక పడుతోంది. నన్ను సంతృప్తి ఆవహిస్తోంది. నేను పిరికివాడినికాను. చాటుమాటు వ్యవహారాలు నాకు గిట్టవు. ఉషను పట్టపగలు నడివీధిలో అందరూ చూస్తూండగా ఇంకెవరికీ దక్కకుండా చేశాను. ఉషను చంపేశాను. ఉష చనిపోయాక నాకుమాత్రం ఈ ప్రపంచంలో పనేముంది.

ఈ మధ్యకాలంలో ఇంతటి ప్రశాంతత నాకెన్నడూ కలగలేదు.

కొంతసేపటికి నా ఆటోని చాలా వెహికల్స్ చుట్టుముట్టాయి. "ఆటో ఆపు!" అన్నాను. ఆపగానే ఆటో దిగి ఆటోవాలాకు పదిరూపాయల నోటిచ్చాను.

నా చుట్టూజనం ఉన్నారుకానీ నన్ను సమీపించడానికి భయపడుతున్నారు. నేను నవ్వుతూ నిలబడి అందరివంకా చూసి "భయపడక్కర్లేదు. నావద్ద యే

ఆయుధమూ లేదు. ఎవరికీ ఏ విధమైన హానీ తలపెట్టను"
అన్నాను.

నా దెబ్బకు ఉషతల పగిలివుండాలి. అంతటి దారుణ హత్య అనంతరం ఇంత నిర్లిప్తంగా, గుండె నిబ్బరంగా కనపడుతున్న నన్ను చూసి ఈ ప్రజావాహినికి ఆశ్చర్యంగా ఉంది. కానీ వారికి నా సంగతి తెలియదు. అనుకున్న పని చేయగలిగాక నాకుచాలా తృప్తిగా ఉంటుంది. అది యెంతటి దారుణ మారణకాండ అయినప్పటికీ, పశ్చాత్తాపం ప్రసక్తిలేదు. అదే మంచిదయింది. లేకపోతే జైల్లో ఉన్నన్నాళ్ళూ కుమిలికుమిలి చావాలి. ఇప్పుడైతే హుషారుగా రాబోయే చావుకోసం ఎదురుచూస్తున్నాను. నా హుషారు జైలు అధికారులకుకూడా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

జీవితంలో ప్రేమకు నోచుకోని మనిషిని నేను. నా కోసం ఏమైనా చేయగలమనిషి ఉంటే నా జీవితం మరోలా ఉండేది. నేను ప్రేమించిన ప్రతివ్యక్తీ నన్ను మోసగించడం జరిగింది.

ఎప్పుడో అప్పుడు నేను పెద్ద నేరంచేసి జైలుపాలవు తానని నా సవతితల్లి అంటూనే ఉండేది. బహుశా స్వానుభవంవల్ల ఆమె అది గ్రహించి ఉండవచ్చు.

ప్రేమ లభించనప్పుడూ, ప్రేమ పేరుతో మోసగించబడినప్పుడూ మనిషి నేరాలు చేస్తాడు. నా సవతితల్లి అటువంటి మనిషే అయుంటుంది. అందుకే నన్నూ తనలా తయారు చేయాలనుకుంది. నాకు ప్రేమ లభించకుండా చేసింది.

అయితే ఆమెచేసే నేరాలు చట్టానికి అందనివి. నేరస్థులను తయారుచేసేవి. అలాంటి వ్యక్తులకీ ప్రపంచంలో శిక్ష లేదు.

నేను చేసిన నేరం ఆమెకులాకాక బాహాటంగా చేశాను. నాపని కాగానే చట్టానికి లొంగిపోయాను. నాలాంటి వాళ్ళకీ లోకంలో స్థానం లేదు.

నేనిప్పుడేమవుతానో—ఎక్కడికి వెడతానో—అక్కడయినా నాకు నిజమైన ప్రేమ రవంతయినా లభిస్తే చాలు. ప్రస్తుతానికి అదొక్కటే నా కోరిక!

—: ఐపోయింది :—